ఈనాడు
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ
మంగళవారం సెప్టెంబరు 1, 2026

వాననీరు, ఐస్ కాపాడాయి

● సముద్రంలో ఎదుర్కొన్న సమస్యలను కలెక్టర్‌కు వివరించిన మత్స్యకారులు

మత్స్యకారుడు శ్రీనుబాబు నుంచి వివరాలను తెలుసుకుంటున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: సముద్రంలో వేట సాగించే మత్స్యకారుల భద్రతకు ప్రభుత్వ పరంగా రక్షణ చర్యలు చేపట్టాలని మత్స్యశాఖ, కోస్టుగార్డ్, మెరైన్ పోలీసులను కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఇటీవల ఓడలరేవు నుంచి సముద్రంలోకి వేటకు వెళ్లి 23 రోజుల పాటు ఇబ్బందులు పడి క్షేమంగా ఇళ్లకు చేరిన మత్స్యకారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మత్స్యకారులు మాట్లాడుతూ నీరు, ఆహారం అయిపోవడంతో వర్షపు నీరు, ఐస్‌తో జీవనం సాగించామన్నారు. బోటు యజమాని కొపనాతి రామకృష్ణ వర్మ మాట్లాడుతూ పాత లారీ ఇంజిన్‌ను బోటుకు అమర్చడం వల్లనే సమస్య వచ్చిందన్నారు. వైర్‌లెస్ సెట్ ద్వారా సమాచారం పంపే ప్రయత్నాలు ఫలించలేదన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎక్కువ రోజులు వేటకు వెళ్లాల్సి వస్తే అదనంగా నిత్యావసరాలు, మరమ్మతులకు అవసరమైన పరికరాలను ఉంచుకోవాలన్నారు. ప్రతి బోటుకు ట్రాన్స్‌పాండర్ అమర్చుకుని, వాడుక తెలుసుకోవాలన్నారు. జిల్లా మత్స్యశాఖ అధికారి కరుణాకర్, అంజలి, బోటు ఇంజిన్ల తయారీ సంస్థ ప్రతినిధి రాజు, కోస్టుగార్డు సిబ్బంది శ్రీను, మెరైన్ సీఐ మూర్తి, ఎస్‌డీవో శివరామకృష్ణ పాల్గొన్నారు.

పింఛన్లకు రూ.83.23 కోట్లు

అల్లవరం: జిల్లాలో పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లకు రూ.83.23 కోట్లు విడుదల చేసినట్లు కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. సెప్టెంబరు నెలకు 1,92,802 మందికి పింఛన్లు అందిస్తామన్నారు. మంగళవారం ఉదయం 7 నుంచి పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ నెలకు కొత్తగా స్పౌజ్ పింఛన్లు 242 మంజూరయ్యాయన్నారు.

చెప్పిందే మాట.. అడిగిందే రుసుము!

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రైటర్లదే రాజ్యం

న్యూస్‌టుడే, రావులపాలెం పట్టణం

అవినీతి రహిత.. పారదర్శకత.. మెరుగైన, వేగవంతమైన సేవలు అందించడమే లక్ష్యంగా ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్ విధానం ద్వారా ఆస్తుల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ప్రభుత్వం తీసుకొచ్చింది. వీటి అమలు అంతంతమాత్రంగా ఉంది.. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దస్తావేజు లేఖర్ల(డాక్యుమెంట్ రైటర్లు) ద్వారానే అన్ని కార్యకలాపాలు సాగుతున్నాయి. వీరిని కార్యాలయ అధికారులు, సిబ్బంది ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

జిల్లాలోని ముఖ్య పట్టణాల్లో రావులపాలెం ఒకటి. దీని పరిధిలో భూముల క్రయవిక్రయాలు అధికసంఖ్యలో జరుగుతుండడంతో ఇక్కడి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు జోరుగా సాగుతున్నాయి. గత ఏడాది నెలకు సరాసరి 385 రిజిస్ట్రేషన్లు కాగా రూ.1.36 కోట్ల ఆదాయం వచ్చింది. ఇక్కడ మధ్యవర్తుల హవా ఆ స్థాయిలోనే సాగుతోందని ఆరోపణలున్నాయి.

● వారేం చెబితే అదే...

రావులపాలెం కార్యాలయం పరిధిలో మొత్తం 24 మంది లేఖర్లున్నారు. వీరిలో నలుగురు చక్రం తిప్పుతున్నారు. వీరు తీసుకొచ్చిన ఫైల్స్‌నే అధికారులు ముందు చేస్తారు, తర్వాతే మిగిలినవి చూస్తారు, కొర్రీలు పెడతారు. నిర్ణయించినదే రుసుము ఎవరికి ఎంతివ్వాలో పంపిణీ చేసేది వీరే.

రావులపాలెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఆవరణలోనే డాక్యుమెంట్ రైటర్ల కార్యాలయాలు

● సిబ్బంది పనీ వీరిదే..

నిబంధనల ప్రకారం కార్యాలయంలోకి లేఖర్లను అనుమతించకూడదు. కానీ ప్రతి పనీ వారి ద్వారానే జరుగుతోంది. నేరుగా కార్యాలయంలోకి వెళ్లి సిబ్బంది చేయాల్సిన పనులు చేస్తున్నారంటే వీరి హవా అర్థం చేసుకోవచ్చు.

● నాకింత.. వారికింత..

నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ చేయించే అమ్మకం, కొనుగోలుదారులు చలానా రూపంలో నిర్ణీత మొత్తం చెల్లించాలి. ఇదక్కడ అమలు కావడం లేదు. ఆస్తుల విలువ, సిబ్బంది పేరుతో పర్సంటేజీ రూపంలో రైటర్లు వసూలు చేస్తున్నారు. అమ్మకం దస్తావేజుకు 3శాతం, బహుమతి దస్తావేజు 2.5శాతం, చెక్‌స్లిప్ రూ.600, ఈసీసీసీ రూ.100, అత్యవసర ప్రాసెసింగ్ రూ.500, నాన్ లేఅవుట్ ఒక్కో సైట్‌కు రూ.5వేలు, ఆర్‌టీడీఎం రూ.600, తాకట్టు దస్తావేజు రూ.లక్షకు రూ.100, స్టాంపింగ్‌కు 100కి రూ.10 వసూలు చేస్తున్నారు.

● ఒక్కో డాక్యుమెంట్‌కు రూ.3వేలు వసూలు

లేఖర్లు కార్యాలయాల వద్దే ఆఫీసులు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఒక్కో డాక్యుమెంట్ తయారీకి రూ.3వేలు వసూలు చేస్తున్నారు. అనధికారికంగా యంత్రాంగానికి కొంత ముట్టచెబుతున్నారు.

● వివాద స్థలాలపై అ'ధనం'

ఓ వ్యక్తి ఇటీవల భూమిపై బ్యాంకులో తనఖా రుణం తీసుకున్నారు. ఓ రైటర్‌కు అధిక మొత్తం చెల్లించి, నకిలీ డాక్యుమెంటు సృష్టించినా వేరొకరికి ఆ భూమిని విక్రయించారు. కొనుగోలుదారు పోలీసులను ఆశ్రయించడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

● ఓ డాక్యుమెంట్ రైటర్ నకిలీ మరణ ధ్రువపత్రంతో రిజిస్ట్రేషన్ చేసేందుకు యత్నించడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు.

దళారుల ప్రమేయం లేకుండా రిజిస్ట్రేషన్లు

ఎవరైనా రిజిస్ట్రేషన్లకు నేరుగా కార్యాలయాన్ని సంప్రదించాలి. లేఖర్లను ప్రోత్సహించడం లేదు. ప్రభుత్వానికి రుసుములు చెల్లిస్తే చాలు. ఎవరైనా అదనంగా అడిగితే ఫిర్యాదు చేయండి.
- వి.ఎల్.సూర్యనారాయణ, సబ్ రిజిస్ట్రార్ రావులపాలెం

సిబ్బంది ఇంతేనా.. సేవలు అంతేనా..?

వైద్య ఆరోగ్య శాఖలో భర్తీకి నోచుకోని పోస్టులు

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

సీహెచ్‌సీలో వైద్యసేవలు పొందుతున్న రోగులు

ఆసుపత్రుల్లో రోగులకు సేవలు అందించేందుకు వైద్యులతో పాటు సరిపడా సిబ్బంది ఉండాలి. అప్పుడే పూర్తి స్థాయిలో సేవలు అందుతాయి. జిల్లాలో ఏ ఆసుపత్రిలో చూసిన ఖాళీలే దర్శనమిస్తున్నాయి. అమలాపురం, రామచంద్రపురంలో ప్రాంతీయ ఆసుపత్రులతో పాటు పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలు 62, 439 సబ్ సెంటర్లు ఉన్నాయి. పీహెచ్‌సీల్లో వైద్యులు పూర్తి స్థాయిలో ఉన్నా.. సిబ్బంది కొరతతో రోగులకు ఇబ్బందులు ఎదురౌతున్నాయి. ఏఎన్ఎం గ్రేడు-3 పోస్టుల ఖాళీలు భారీగా ఉన్నాయి. ప్రతి పీహెచ్‌సీలో 14 మంది వరకు సిబ్బంది ఉండాలి. చాలాచోట్ల 6-10 మంది మాత్రమే ఉన్నారు.

- 0 — ఎక్స్‌రే అటెండెంట్ పోస్టులు రెండు అవసరం కాగా.. ఒక్కరూ లేరు.
- 1 — హెల్త్‌ఎడ్యుకేటర్లు నలుగురికి ఒక్కరే ఉన్నారు.
- 2 — డ్రైవర్లు 14 మందికి ఒప్పంద పద్ధతిలో ఇద్దరు విధులు నిర్వహిస్తున్నారు.

4 గంటలకే ఇంటికి..

పీహెచ్‌సీల్లో 24 గంటలూ సేవలు అందించాలి. వైద్యులు ఉదయం 10 గంటలకు వచ్చి సాయంత్రం నాలుగు గంటలకే ఇళ్లకు వెళ్లిపోతున్నారు.

జిల్లాలో కొన్ని పోస్టులు ఇలా.. (శాశ్వత, ఒప్పంద పద్ధతిలో..)

విభాగం	అవసరమైన పోస్టులు	ప్రస్తుతం ఉన్నవారు
సీహెచ్‌వో	23	16
ఎంపీహెచ్ఎస్(ఎం)	45	35
ఎంపీహెచ్ఎస్(ఎఫ్)	52	20
ఎంపీహెచ్ఈఓ	33	24
పీహెచ్ఎన్	28	23
స్టాఫ్ నర్సు	121	107
ఏఎన్ఎం గ్రేడ్-3	439	283
ఎంపీహెచ్ఏ(ఎఫ్)	244	176

జిల్లాలో 366 ఖాళీలు..

జిల్లాలో వైద్యాధికారుల నుంచి సీహెచ్‌వో, ఎంపీహెచ్ఎస్, సీనియర్ అసిస్టెంట్, ఏఎన్ఎం, ల్యాబ్ టెక్నీషియన్ తదితర విభాగాల్లో 1836 మంది ఉద్యోగులు ఉన్నారు. వీరిలో 833 మంది రెగ్యులర్, 637 మంది ఒప్పంద పద్ధతిలో పనిచేస్తున్నారు. మరో 366 మందిని నియమించాల్సి ఉంది.

సిబ్బందిని సర్దుబాటు చేస్తున్నాం..

ప్రస్తుత సిబ్బందిని సర్దుబాటు చేసి రోగులకు సేవలు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. పీహెచ్‌సీల్లో సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటాం. ఖాళీల భర్తీకి ప్రభుత్వానికి నివేదించాం. - ఎం.దుర్గారావు దొర, జిల్లా వైద్యాధికారి

శుభ్రతకు చిక్కులెన్నో..

స్వచ్ఛాంధ్ర పురస్కారాలకు నేటి నుంచి బృందాల పరిశీలన

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

గ్రామాలు, పట్టణాల్లో స్వచ్ఛతను పాటించడంలో ముందు వరుసలో నిలిచే పురపాలక సంఘాలు, పంచాయతీలకు ప్రభుత్వం ఏటా ర్యాంకులు ప్రకటిస్తున్నారు. స్వచ్ఛాంధ్ర అవార్డులు అందించి ప్రోత్సహిస్తోంది. అక్టోబరు 2న గాంధీ జయంతి సందర్భంగా రాష్ట్ర, జిల్లా స్థాయి అవార్డులను అందజేయనున్నారు. దీనికి ఇప్పటికే కార్యాచరణ ప్రారంభమైంది. జిల్లాలో అమలాపురం, రామచంద్రపురం పురపాలక సంఘాలు, ముమ్మిడివరం నగర పంచాయతీ, 342 పంచాయతీలు ఉన్నాయి. పట్టణాలు, పంచాయతీలతో పాటు పాఠశాలలు, అంగన్‌వాడీ, ఆసుపత్రి, ప్రభుత్వ కార్యాలయాలు, బస్‌స్టేషన్, రైతు బజార్, వసతి గృహాలు, పరిశ్రమలు, ఎన్‌జీవో, పారిశుద్ధ్య కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కాలనీలు, పర్యాటక ప్రాంతాలు, పార్కులు, ఆలయాలు ఇలా 21 విభాగాల్లో 100 చొప్పున మార్కులు కేటాయించి స్వచ్ఛాంధ్ర-2026 అవార్డులు ఇవ్వనున్నారు.

ముమ్మిడివరం డంపింగ్ యార్డు వద్ద పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

● సిబ్బంది ఏరీ..

రెండు పురపాలక సంఘాలు, నగర పంచాయతీలో రోజుకు 60 టన్నుల చెత్త వస్తోంది. సిబ్బంది కొరత, యంత్రాలు పనియకపోవడం వంటి కారణాలతో వీధుల్లో పూర్తి స్థాయిలో చెత్తను తరలించడం లేదు. ముమ్మిడివరం నగర పంచాయతీలో 70 మంది పారిశుద్ధ్య కార్మికులు అవసరం కాగా.. కేవలం 27 మంది మాత్రమే ఉన్నారు. సరిపడా డంపింగ్ యార్డులు లేవు. గతంలో నిర్మించిన ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలు ప్రస్తుతం అలంకారప్రాయంగా మిగిలాయి. ఎక్కడపడితే అక్కడ చెత్త వేస్తున్నారు.

క్షేత్ర స్థాయి పరిశీలన
- జిల్లా బృందాల పరిశీలన: సెప్టెంబరు 1-8
- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌కు ర్యాంకుల నివేదిక: 8న
- థర్డ్ పార్టీ ఏజెన్సీ నిర్ధారణ: 10-21
- నివేదిక సమర్పణ: 25
- ర్యాంకుల తుది జాబితా: 27
- అవార్డుల ప్రదానం: అక్టోబరు 2

పడిగాపుల ప్రయాణం

రైళ్ల ఆలస్యంతో ప్రయాణికుల అవస్థలు

వీఎల్‌పురం: సమయానుకూలంగా రైళ్లు నడవక.. ప్రయాణం ముందుకు సాగక.. సకాలంలో గమ్యస్థానాలకు చేరలేక సోమవారం ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

గూడ్స్ రైలు పట్టాలు తప్పడంతో..

కొవ్వూరు రైల్వేస్టేషన్ వద్ద సోమవారం ఉదయం గూడ్స్ రైలు పట్టాలు తప్పిన ఘటనతో అటు విజయవాడ, ఇటు విశాఖ వైపు వచ్చే రైళ్లు గంట నుంచి నాలుగు గంటలు ఆలస్యంగా నడిచాయి. మరికొన్ని ఏడు గంటకు పైగా ఆలస్యం కావడం గమనార్హం. ఇంకొన్నింటిని స్థానిక స్టేషన్‌లో నిలిపేయడంతో ప్రయాణికులు అసహనానికి గురయ్యారు. రాజమహేంద్రవరం ఒకటో ప్లాట్‌ఫామ్‌పై సహాయ కేంద్రం ఏర్పాటు చేశారు.

✦ చంగల్పట్టు జంక్షన్ నుంచి ఉదయం 6.48కు రావాల్సిన కాకినాడ పోర్టు సర్కారు ఎక్స్‌ప్రెస్ 8.12కు వచ్చింది.
✦ ఉదయం 7.48కు రావాల్సిన టాటానగర్ ఎక్స్‌ప్రెస్ 11.30, 7.55కు రావాల్సిన అనకాపల్లి ఏసీ ఎక్స్‌ప్రెస్ 12.08 గంటలకు వచ్చాయి. ✦ రత్నాచల్ సూపర్‌ఫాస్ట్ ఉదయం 8.03కు చేరాల్సి ఉండగా.. మధ్యాహ్నం 12.19కు వచ్చింది. ఉదయం 8.23కు రావాల్సిన ధన్బాద్ ఎక్స్‌ప్రెస్ 12.44 గంటలకు వచ్చింది.

రూ.327 కోట్లతో విద్యుత్తు వ్యవస్థ ఆధునికీకరణ

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో విద్యుత్తు సమస్యల పరిష్కారానికి రూ.327 కోట్లతో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎంపీ హరీష్ మాధుర్, ఎమ్మెల్యే ఆనందరావులతో కలిసి ట్రాన్స్‌కో అధికారులతో సమీక్ష నిర్వహించారు. వచ్చే వేసవి నాటికి జిల్లాలో ఎటువంటి అవాంతరాలు లేని విద్యుత్తు సరఫరా లక్ష్యంగా అధికారులు పని చేయాలన్నారు. విద్యుత్తు శాఖ ఎస్ఈ రాజేశ్వరి దేవి మాట్లాడుతూ జిల్లాలో 19 మండలాల పరిధిలో 362 గ్రామాల్లో విద్యుత్తు వ్యవస్థను ఆధునికీకరించేందుకు రూ.327 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఆ నిధులతో సింగిల్ ఫేజ్ లైన్లను త్రీఫేజ్‌గా మార్పు చేయాలన్నారు. నియంత్రికల సామర్థ్యాన్ని 650 యాంప్స్‌కు పెంచుతామన్నారు.

ఊడుమూడి మధ్యలంకలోంచి కొబ్బరికాయలను పడవలో ఒడ్డుకు చేరుస్తున్న రైతులు

రవాణా ఖర్చులు తడిసిమోపెడు

జిల్లాలో వశిష్ఠ, వైనతేయ, గౌతమి గోదావరి నదీపాయలకు సంబంధించి మధ్యలంకల్లో వేలాది ఎకరాల్లో కొబ్బరి, ఇతర ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. ఉత్పత్తులను రేవుల వద్దకు చేర్చి మరపడవల్లో ఇవతలకు తరలించాలి. అక్కడి నుంచి రోడ్డు మార్గాన మార్కెట్లకు చేరవేస్తారు. దీంతో ఖర్చు తడిసిమోపెడు అవుతోంది. నదీపాయల మీద వంతెనలు, కాజ్‌వేలు నిర్మిస్తే మేలు కలుగుతుంది. - న్యూస్‌టుడే, పి.గన్నవరం

గుండెకోతకు గడ్డి కవచం

భూములు గోదావరిలో కలిసిపోకుండా రెల్లు పెంచాలంటున్న శాస్త్రవేత్తలు

న్యూస్‌టుడే, పి.గన్నవరం

గోదావరికి ఎర్రనీరు తగిలితే చాలు ఏటా విలువైన లంకభూములు నదీకోతకు గురవుతున్నాయి. రెక్కల కష్టంతో పెంచుకున్న కొబ్బరి చెట్లు కళ్లముందే నీటిలో ఒరిగిపోతున్నాయి. నాలుగు దశాబ్దాల క్రితం వరకు ఈ ప్రభావం తీవ్రంగా ఉండేది కాదు. అప్పట్లో ప్రకృతిసిద్ధంగా తీరం వెంబడి రెల్లుగడ్డిని ప్రత్యేకంగా పెంచేవారు. జలవనరులశాఖలో 'రెల్లుగడ్డి వాచర్స్' పేరుతో లస్కర్ స్థాయిలో ఉద్యోగులు కూడా ఉండేవారు. నదీకోత నుంచి భూములకు రక్షణ కవచంలా పనిచేసే రెల్లుగడ్డిని పెంచడం ప్రస్తుతం విస్మరించారు. ఈ కారణంగా ఏటికేడు తీవ్రత పెరిగిపోతూ లంకరైతులు గుండెకోత అనుభవిస్తున్నారు.

బెల్లంపూడి వద్ద నదీకోత కాకుండా కాపాడుతున్న రెల్లుగడ్డి

ఆ రోజుల్లో ఏం చేసేవారంటే..

రెల్లుగడ్డిని పెంచేందుకు అప్పట్లో ఏటిగట్లను ప్రాతిపదికగా చేసుకుని ప్రతి 5 కిలోమీటర్లకు ఒక వాచర్ ఉండేవారు. గోదావరి వరదలు వెళ్లిన అనంతరం తన పరిధిలో తీరం వెంబడి పరిశీలన చేసి ఎక్కడైతే నదీకోత మొదలవుతుందో అక్కడ రెల్లుగడ్డిని నాటేవారు. కావిళ్లతో నీరుపోసి పోషించేవారు. తద్వారా గుబురుగా పెరిగి వేర్లు భూమిలోకి బలంగా చొచ్చుకుపోయి అల్లుకునేవి. మట్టి కరిగిపోకుండా ఉండేది. స్వల్ప ఖర్చుతో ఎంతో ప్రయోజనం చేకూరేది. ప్రస్తుతం ఇలాచేయడం మానేశారు. ఎక్కడైనా రెల్లుగడ్డి కనిపిస్తే నేటికీ కొంతమంది రైతులు తొలగించకుండా ఉంచుతున్నారు. ఆయా ప్రదేశాల్లో నదీకోత తీవ్రత చాలా తక్కువగా ఉంటోంది.

ప్రస్తుతం పరిస్థితుల్లో ఎంతో అనుకూలం

జిల్లాలో వశిష్ఠ, వైనతేయ, గౌతమి, వృద్ధగౌతమి పరీవాహక ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టేందుకు ఇటీవల హెడ్‌వర్క్స్ ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదనలు చేశారు. సుమారు రూ.3 వేల కోట్ల నిధులు అవసరం ఉంటుందని అంచనా వేశారు. ఇన్ని నిధులు కేటాయించాలంటే ప్రభుత్వానికి భారంతో కూడిన పని. ఇటువంటి పరిస్థితుల్లో కనీసం రెల్లుగడ్డిని పెంచితే ప్రయోజనం చేకూరుతుంది. ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని రెల్లుగడ్డిని పెంచేందుకు వీబీ జీ రామ్‌జీ పథకంలో చేర్చితే ప్రయోజనం కలుగుతుందని పలువురు అంటున్నారు.

గోదావరి నదీపాయలు ఇలా (కి.మీ)	
గౌతమి:	63.40
వృద్ధగౌతమి:	21.70
కోరింగ:	15.00
వశిష్ఠ:	90.60
వైనతేయ:	28.30

బహుళ ప్రయోజనం

రెల్లుగడ్డితో బహుళ ప్రయోజనాలు ఉన్నాయి. ఇది మూడు మీటర్ల మేర ఎత్తు పెరుగుతుంది. వేర్లు గుబురుగా వ్యాప్తిచెంది మట్టిలోకి చొచ్చుకుపోతాయి. ఇలా అల్లుకున్న వేర్లు మట్టిని కరిగిపోకుండా రక్షిస్తాయి. నదీకోత నివారణకు ఎంతగానో ఉపకరిస్తుంది. ఔషధాల తయారీకి వీటివేర్లు పనిచేస్తాయి. పశువులు, ఇతర జంతువుల నుంచి పంటలను రక్షించేందుకు సైతం దోహదపడుతుంది.
- ఎం.నందకిషోర్, కోఆర్డినేటర్, జిల్లా ఏరువాక కేంద్రం

ఒకరితో పెళ్లి.. ఆరుగురితో సహజీవనం

● కాకినాడ ఎస్పీ కార్యాలయంలో భర్తపై మహిళ ఫిర్యాదు
● బలవంతంగా మతమార్పిడి చేశాడని వెల్లడి

ఈనాడు, కాకినాడ: కాకినాడకు చెందిన పంచాయతీరాజ్ ఏఈ టి.నూకరాజు కుటుంబం సామూహిక ఆత్మహత్య ఘటన మరువక ముందే మరో యువతి తాను కూడా తన భర్త ద్వారా బలవంతపు మతమార్పిడికి గురయ్యానని కాకినాడ ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. జగన్నాథపురానికి చెందిన గౌస్ మొహిద్దీన్ తనను పెళ్లి చేసుకుని వేధింపులకు గురిచేయడమే కాక మరో అయిదుగురు హిందూ మహిళలను ఉచ్చులోకి లాగి సహజీవనం చేస్తూ మతమార్పిడికి పాల్పడ్డాడని అతని భార్య ఉమల్ ఖైర్ అలియాస్ బాలరమ్య ఆరోపించారు. సోమవారం భాజపా జిల్లా మాజీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్‌తో కలిసి ఎస్పీ బిందుమాధవ్‌కు ఫిర్యాదు చేశారు. మొహిద్దీన్ నుంచి రక్షణ కల్పించాలని, కఠినంగా శిక్షించాలని కోరారు.

ఇష్టం లేకుండా మతం మార్పించి..

'నా పేరు శిరివూరి బాలరమ్య. జగన్నాథపురంలో డిగ్రీ చదువుతున్నప్పుడు మొహిద్దీన్‌తో పరిచయం. తల్లిదండ్రుల ఇష్టానికి వ్యతిరేకంగా మటన్ దుకాణం నడిపే మొహిద్దీన్‌ను ఎనిమిదేళ్ల క్రితం పెళ్లి చేసుకున్నా. రెండు నెలలకే అతని వేధింపులు మొదలు.. బలవంతంగా మాతమార్పిడి చేయించి షేక్ ఉమల్ ఖైర్‌గా నా పేరు మార్చాడు. కుమార్తె పుట్టిన తర్వాత నన్ను తీవ్రంగా హింసించడంతో స్థానిక పెద్దలకు చెప్పినా అతనిలో మార్పులేదు. నేను చూస్తుండగానే అయిదారుగురు మహిళలతో సహజీవనం చేశాడు. అడిగితే ఏడుగురిని చేసుకున్నా అడిగేవారు లేరని, దిక్కున్నచోట చెప్పుకోమని తీవ్రంగా కొట్టాడు. అతని నుంచి ఓసారి తప్పించుకుని వెళ్లినా వెతుక్కుంటూ వచ్చి కత్తులు దూశాడు. ఇతనికి భయపడి దూరంగా ఉంటున్న మా తల్లిదండ్రులకు ఫోన్ చేసి మీ రెండో అమ్మాయినీ వేధిస్తానని బెదిరించాడు. అతనితో సన్నిహితంగా తిరిగిన ఓ యువతిని కత్తితో గాయపర్చడంతో గతంలో 20 రోజులు రిమాండ్‌లో పెట్టి రౌడీ షీట్ తెరిచారు. ఇటీవల మరో ఎస్సీ యువతిని వేధించగా ఆమె ఫిర్యాదుతో ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్నాడు. దీంతో ధైర్యం చేసి ఫిర్యాదు చేయడానికి వచ్చాను.' అంటూ బాలరమ్య వాపోయారు.

కుమార్తె బాలరమ్యకు బొట్టు పెడుతున్న తల్లి

● ఎస్పీ కార్యాలయం ఎదుటే తన తల్లితో నుదుటిపై బొట్టు పెట్టించుకుని తాను తిరిగి హిందూ మతంలోకి వచ్చినట్లు బాలరమ్య ప్రకటించారు.
● లవ్ జిహాద్‌ను తలపించేలా జరుగుతున్న బలవంతపు మతమార్పిడిలపై లోతైన దర్యాప్తు చేయాలని భాజపా నేత రామ్‌కుమార్ పోలీసులను కోరారు.

సాఫీగా.. సాగిపోయేలా..

● పుష్కరాలకు ట్రాఫిక్ ఇక్కట్లు లేకుండా ప్రణాళికలు

న్యూస్‌టుడే, కంబాలచెరువు(రాజమహేంద్రవరం)

గోదావరి పుష్కరాలకు పెద్ద ఎత్తున భక్తులు రానున్నారు. పుణ్య స్నానాలకు వీలుగా తూర్పులో 82 ఘాట్‌ల వద్ద ఏర్పాట్లు జరుగుతున్నాయి. రోజుకు దాదాపు 50 లక్షల మంది వస్తారని అంచనా వేస్తున్నారు. వాహనాల క్రమబద్ధీకరణ, ట్రాఫిక్ ఇక్కట్లు లేకుండా పోలీసులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

ప్రత్యేక జోన్లు

● ఘాట్‌లకు వెళ్లే మార్గాలను పాదచారుల జోన్లు, నో వెహికల్ జోన్లు, అత్యవసర వాహనాలు వెళ్లే జోన్లుగా విభజించనున్నారు. పార్కింగ్ స్థలాలు, శాటిలైట్ బస్టాండ్లు, హోల్డింగ్ ప్రాంతాలను గుర్తిస్తున్నారు. నగరం, బయట ప్రాంతాల్లో సుమారు 30 చోట్ల వాహనాల నిలిపేందుకు స్థలాలను ఎంపిక చేశారు.

ఎక్కడికక్కడ మళ్లింపు

☛ విశాఖ వైపు నుంచి రాజమహేంద్రవరం మీదుగా వెళ్లే భారీ వాహనాలను కాకినాడ జిల్లా కత్తిపూడి వద్ద కోస్టల్ కారిడార్ వైపు మళ్లించి... చించినాడ వంతెన, నరసాపురం మీదుగా పంపించనున్నారు. పుష్కరాలకు వచ్చే వాహనాలను మాత్రమే అనుమతిస్తారు.

☛ కత్తిపూడి నుంచి రాజమహేంద్రవరం వైపు వచ్చే కొన్ని వాహనాలను జగ్గంపేట నుంచి కాకినాడ వైపు, మరి కొన్నింటిని మన్యం వైపునకు మళ్లించనున్నారు.

☛ పుష్కరాలకు వచ్చే వాహనాలను దివాన్‌చెరువు, లాలాచెరువు సమీపంలో నిలిపి, అక్కడి నుంచి ప్రభుత్వ వాహనాల్లో భక్తులను ఘాట్‌ల వద్దకు తీసుకొచ్చే యోచన ఉంది. ☛ విజయవాడ నుంచి రాజమహేంద్రవరం మీదుగా విశాఖ వెళ్లే వాహనాలను మచిలీపట్నం మీదుగా కోస్టల్ కారిడార్‌లోకి మళ్లిస్తారు.

క్షేత్రస్థాయిలో ఇలా..

■ ఆర్టీసీ బస్సులకు రాజమహేంద్రవరం పేపర్‌మిల్లు, లూథర్‌గిరి సమీపంలో బస్టాండ్లు ఏర్పాటుచేస్తారు. పేపర్‌మిల్లు రోడ్డు, సీతంపేట, ఆర్యాపురం, గోకవరం బస్టాండు, దేవీచౌక్, కంబాలచెరువు, జెండా పంజా రోడ్డు, మెయిన్‌రోడ్డు తదితర ప్రాంతాలన్నీ నో వెహికల్ జోన్‌గా ఉండనున్నాయి.

■ పాదచారుల జోన్ల మీదుగా భక్తులు కోటిలింగాలఘాట్, పుష్కరఘాట్‌కు నడిచి వెళ్లాలి.

మళ్లీ మేత ధరల పెంపు పిడుగు..!

కిలోకు రూ.14 పెంచాలనే ప్రతిపాదనపై ఆందోళన

న్యూస్‌టుడే, అల్లవరం

అసలే తీవ్ర సంక్షోభంలో ఉన్న ఆక్వా రంగంపై మరో పిడుగు పడనుందనే సంకేతాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల మేతల తయారీ కంపెనీలు కిలోకు రూ.12 వరకు పెంచాయి. సాగుదారుల నుంచి వ్యతిరేకత రావడంతో జూన్‌లో సీఎం స్పందించి పెంపును రూ.8కు పరిమితం చేశారు. రెండు నెలలు గడవకముందే కిలోకు మళ్లీ రూ.14 వరకు పెంచేలా తయారీదారులు ప్రతిపాదన పెట్టారు. మేతలో వినియోగించే ఫిష్‌మీల్, ఆయిల్, ధరలు పెరిగాయని, యుద్ధం వల్ల గల్ఫ్ నుంచి ముడి సరకు దిగుమతి తగ్గిందని తయారీదారులు చెబుతున్నారు.

నష్టాల్లోకి రైతులు..

ఏడాదిలో మూడు నుంచి నాలుగు సార్లు మేత ధరలు పెరుగుతుండటం ఆక్వా రైతులను కలవరానికి గురి చేస్తోంది. ఒకసారి పెరిగితే తగ్గే అవకాశం లేదు. రొయ్యల ధరలు మాత్రం మార్కెట్‌లో ఉత్పత్తుల లభ్యత ఆధారంగా పెరుగుతూ, తగ్గుతూ ఉంటున్నాయి.

● కిలో 100 కౌంట్ రొయ్యల ఉత్పత్తికి రైతుకు రూ.250 నుంచి రూ.280 ఖర్చవుతుంది. మార్కెట్లో ఉత్పత్తి తక్కువగా ఉంటే గరిష్ఠంగా రూ.270 ధర పలుకుతోంది. ఉత్పత్తి ఎక్కువగా ఉంటే ధరలు తగ్గించేసి రూ.230 వరకు తీసుకువచ్చేస్తున్నారు. శనివారం ఓడలరేవు వచ్చిన మత్స్యశాఖ రాష్ట్ర కమిషనర్ రామశంకర్‌నాయక్ స్పందిస్తూ కంపెనీలు ప్రతిపాదించినంత పెరగకపోవచ్చని, కొంత మొత్తం పెంపు ఉండే అవకాశం ఉందన్నారు. ఆక్వారైతు సంఘం (కోనసీమ) అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబు రాజు మాట్లాడుతూ ఆక్వా రంగంపై మేతల ధరలు విపరీతమైన ప్రభావం చూపుతాయన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

WANTED DOCTORS
We Require Full time Specialist Doctors MD, MS or Diploma in a Reputed Hospital in Rajahmundry.
If Interested Please Contact:
Dr. Subhash
Bommana Hospitals
Rajahmundry
99665 30364

వెరికోస్ వెయిన్స్
ఉచిత శిబిరం
12 సెప్టెంబర్, 2026 (ఉ॥ 9 గం॥ నుంచి సా॥ 5 గంటల వరకు)

ఉచితం
డా. నితిన్ రిమ్మలపూడి
కన్సల్టేషన్ & వెనస్ డాప్లర్ స్కాన్
విలువ ₹ 5000/-
డెల్టా హాస్పిటల్స్
deltahospitals.com
వెంకటేశ్వర నగర్, రాజమండ్రి.
రిజిస్ట్రేషన్ కోసం కాల్ చేయండి:
85230 44338

(c) eenadu

రక్షిత భవనంతో భయం

మేడిచర్లపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల భవనాలను ఆనుకొని ఉన్న శిథిల తుపాను రక్షిత భవనంతో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సుమారు 35 ఏళ్ల కిందట పాఠశాల ఆవరణలో ఈ భవనాన్ని నిర్మించారు. దీని నిర్వహణ లేకపోవడంతో క్రమంగా శిథిలావస్థకు చేరింది. కొన్నాళ్ల కిందట దీనిలో రెవెన్యూ కార్యాలయాన్ని, పాఠశాల తరగతులు, రైతు సేవా కేంద్రాలను నిర్వహించే వారు. పూర్తిగా శిథిలమై స్లాబు పెచ్చులూడుతుండడంతో వాటిని వేరే చోటికి మార్చారు. ప్రస్తుతం ఖాళీగా ఉంది. ఎప్పుడు కూలుతుందోనని పక్కనే ఉన్న పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు భయపడుతున్నారు. దీనిపై ప్రధానోపాధ్యాయుడు త్రిమూర్తులు వద్ద ప్రస్తావించగా పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

– న్యూస్‌టుడే, మలికిపురం

అయినవిల్లికి పోటెత్తిన భక్తజనం

సంకటహర చతుర్థి పర్వదినం సందర్భంగా సోమవారం అయినవిల్లి సిద్ధివినాయకస్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. పెద్దఎత్తున విచ్చేసి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. లక్ష్మీ గణపతి హోమంలో పాల్గొన్నారు. కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. చిన్నారులకు అక్షరాభ్యాసాలు, అన్నప్రాసనలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. వివిధ రుసుముల ద్వారా ఆలయానికి రూ.3,91,368 ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.

– న్యూస్‌టుడే, అయినవిల్లి

సినిమా చెట్టు.. పట్టించుకుంటే ఒట్టు

ఆ మామిడి చెట్టు కింద సీతారామయ్య గారి మనవరాలు వంటి ఎన్నో ఉత్తమ చిత్రాలు రూపుదిద్దుకున్నాయి. ఈ ప్రాంతంలో సినిమా చిత్రీకరణకు వచ్చిన డైరెక్టర్లు సెంటిమెంట్‌గా ఇక్కడ ఒక్కసీన్ అయినా తీయకమానరు. అలాంటిది నేడు నిర్వహణ కరవైంది. స్థానిక బ్యాంక్ కెనాల్ లాకులకు ఆనుకుని ఉన్న ఈ చెట్టు నీటి ఒరవడికి చుట్టూ మట్టి కొట్టుకుపోయింది. వేర్లు బయటపడి వచ్చి పడిపోయేలా ప్రమాదకరంగా ఉంది. గట్టు పటిష్ఠం చేయాలని పలువురు కోరుతున్నారు. దీనిపై ఇరిగేషన్ ఏఈ సాయిమాధవ ప్రసన్న వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

– న్యూస్‌టుడే, ఆత్రేయపురం

సత్యదేవుని సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం సత్యనారాయణ స్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.రమేష్ సోమవారం దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామిని దర్శించుకుని పూజలాచరించిన అనంతరం న్యాయమూర్తి దంపతులకు వేదపండితులు ఆశీస్సులు అందించారు. డిప్యూటీ కమిషనర్ బాబూరావు సత్యదేవుని చిత్రపటం, స్వామి ప్రసాదం అందించారు.

పనుల్లో తాత్సారం.. చివర్లో తడబాటు

న్యూస్‌టుడే, మామిడికుదురు, రాజోలు

వచ్చే ఏడాది జరిగే గోదావరి మహా పుష్కరాల సమయంలో నదీపాయల్లో పుణ్యస్నానాలు ఆచరించే భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా ఇప్పటినుంచే ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉంది. ప్రధానమైన వైనతేయ, వశిష్ఠ నదీ తీరాల్లో నిర్దేశించిన ప్రదేశాల్లో ఘాట్‌ల ఆధునికీకరణకు ఆమోదం వచ్చినా టెండర్ల ప్రక్రియ చేపట్టకపోవడం గమనార్హం. సకాలంలో పనులకు ఉపక్రమించి వచ్చే ఫిబ్రవరి నాటికి పూర్తిచేస్తే అన్నివిధాల శ్రేయస్కరంగా ఉంటుంది. నిర్మాణాల పరంగా లోటుపాట్లు చక్కదిద్దుకోవడం, అక్కడ అవసరమైన ఇతర మౌలిక సదుపాయాల పరంగా పనులు చేసుకునేందుకు వెసులుబాటు కలుగుతుందని భక్తులు అంటున్నారు. నిధుల మంజూరుకు ఆమోదం వచ్చిందని హెడ్‌వర్క్స్ ఏఈఈ టీవీఎల్ఎన్ మూర్తి తెలిపారు. టెండర్ల దశ పూర్తికాగానే పనులు చేపడతామని చెప్పారు.

అప్పనపల్లిలో ఛిద్రంగా మారిన ఘాట్

32 ప్రాంతాల్లో ఆమోదం వచ్చినా..

మొత్తం రూ.14.98 కోట్ల వ్యయంతో వశిష్ఠ నదికి కుడివైపున 13, వైనతేయకు కుడివైపున 5, ఎడమ వైపున 14 ఘాట్‌లు నిర్మించేందుకు పరిపాలనా అనుమతి వచ్చింది. ఇందులో ప్రధానమైన మూడుచోట్ల ప్రత్యేకంగా దృష్టిపెట్టాల్సి ఉంది. ■ అప్పనపల్లి బాలబాలాజీస్వామి దేవస్థానం సమీపంలో 30 మీటర్ల మేర ఉన్న ఘాట్‌ను 50 మీటర్లకు విస్తరించనున్నారు. సోంపల్లిలో 30 మీటర్లు, అంతర్వేదిదేవస్థానంలో 50 మీటర్లకు పెంచి పూర్తిస్థాయిలో ఆధునికీకరిస్తారు. మిగతా 29 ఘాట్లను విస్తరించకుండా ఉంచి అవసరమైన మరమ్మతులు, సౌకర్యాలు కల్పిస్తారు. ■ ప్రతి ఘాట్‌కు మెట్లను పటిష్ఠం చేయడంతో పాటు లోతు జలాల్లోకి వెళ్లకుండా ఇనుప కమ్మీలతో కవచాలు ఏర్పాటు చేస్తారు. చుట్టూ గుంతలు, బురద లేకుండా చదును చేస్తారు. మెట్లు ఎక్కి దిగేందుకు ప్రత్యేకమైన టైల్స్ వేస్తారు. పనులు పూర్తిచేసి వాటిని రంగులతో అలంకరిస్తారు. ■ అల్లవరం మండలం బోడసకుర్రు, గోపాయలంక, గోడి, వాకలగరువు, బెండమూర్లంక, అంబాజీపేట మండలం తొండవరం, పి.గన్నవరం, ముంజవరం, వై.కొత్తపల్లి, అంతర్వేదిపాలెం, సఖినేటిపల్లి తదితర చోట్ల పూర్తిస్థాయిలో ఆధునికీకరించేందుకు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

నదీపాయ	ఘాట్‌ల మంజూరు	నిధులు (రూ.కోట్లు)
వైనతేయ కుడి	5	3.05
వైనతేయ ఎడమ	14	5.68
వశిష్ఠ ఎడమ	13	6.25

గత అనుభవాల నేపథ్యంలో..

■ గత పుష్కరాల్లో పలుచోట్ల కొత్తగా నిర్మించిన, అభివృద్ధి చేసిన ఘాట్‌లను ఎవరూ పట్టించుకోకపోవడంతో చాలావరకు దెబ్బతిన్నాయి. మెట్లు విరిగి, గుంతలు పడ్డాయి. పోటు నీటి ప్రభావంతో కిందిభాగంలో కోత బారిన పడ్డాయి. ■ అప్పనపల్లి, అంతర్వేది దేవస్థానం సహా పలుచోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. ఇక్కడ ప్రతిరోజూ వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు చేస్తుంటారు. ■ సోంపల్లిలో అంత్యక్రియలు, పిండ ప్రదానాలకు సంబంధించి అనేక మంది స్నానాలకు వెళ్తుంటారు. ఇక్కడ పరిస్థితులు ప్రతికూలంగా ఉండటంతో ఇబ్బందులకు గురవుతున్నారు. ■ ఇటువంటి ప్రదేశాల్లో విస్తరణ, ఆధునికీకరణ దిశగా చేపట్టే పనులు పటిష్ఠంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత ఉంది.

సంక్షేమ బోర్డు ఏర్పాటుకు డిమాండ్

నిరసన తెలుపుతున్న కొబ్బరి ఒలుపు, దింపు కార్మికులు

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: కొబ్బరి ఒలుపు, దింపు కార్మికులకు ధరలు పెంచి ఆదుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన ప్రదర్శన చేశారు. అయినవిల్లి మండలం కొబ్బరి ఒలుపు కార్మికుల పట్ల కులవివక్ష చూపిన వ్యాపారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలన్నారు. జిల్లాలో 30వేల మంది కార్మికులు ఈ రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. వారి కోసం కొబ్బరి కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం పీజీఆర్ఎస్‌లో వినతి పత్రం అందించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్, కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సుబ్బారావు, కారెం వెంకటేశ్వరరావు, కార్మికులు పాల్గొన్నారు.

మహిళ సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్ మహేష్‌కుమార్

185 అర్జీల స్వీకరణ

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వస్తున్న అర్జీలకు సకాలంలో పరిష్కార మార్గాలు చూపాలని కలెక్టర్ మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. 185 మంది తమ సమస్యలపై ఫిర్యాదులు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. వీటిని అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని ఆదేశించారు.

పత్రికా ప్రకటన (శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో)

మహారాజశ్రీ రామచంద్రపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.A. 73/2026 In E.P. 113/2017 IN

O.S. No.219/2003

Between:

Mamidi Lakshmi Narayana ... D.H.R

And

1. Ganapathirao Harikrishna Rao
2. Ganapathirao Ramachandra Rao (Died) & Others ...J.D.Rs

(3rd to 5th are add as per the E.A. 300/2018 order dated 15-03-2023 the 3rd to 5th are J.D.Rs are LRS of 2nd J.D.R.)

1st J.D.R.

Ganapathirao Harikrishna Rao,
S/o Ganapathirao, Age 64 years, Main Road, R/o Ramachandrapuram, Ramachandrapuram Mandal, Ramachandrapuram DMC.

4th J.D.R.

Movaddi Swathi Pai, W/o Not known,
D/o Late Ganapathirao Ramachandra Rao, aged 40 years, Hindu, R/o D.No.12-160, Koppisettivari Street, R/o Kothapeta, Kothapeta Mandal, E.G.Dt., Kothapeta PJCJ

పై నెంబర్ గ్రంథంలో పై వాది పరిహారం నిమిత్తం పై కోర్టులో మీపై E.Pను దాఖలు చేయగా సదరు కోర్టు వారు అనేక పర్యాయములు E.A. 73/2026 నోటీసులు కోర్టు నుండి పంపగా మీరు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. అందుపై శ్రీ కోర్టు వారు పేపర్ ప్రకటన ద్వారా మీకు నోటీసులు అమలు జరుపుటకు ది.వి 03-09-2026న వాయిదా వేసియున్నారు. కావున మీరు గాని, మీ తరపున ప్లీడరు గాని శ్రీ కోర్టు వారి ఎదుట ది.వి 03-09-2026న ఉదయం గం॥ 10-30 ని॥లకు హాజరు అయ్యి మీ తరపున ఆక్షేపణలు ఏమైనా ఉంటే దాఖలు చేయగలరు. లేనియెడల మీ తరపున శ్రీ కోర్టు వారు పరోక్షముగా ఉత్తర్వులు చెయ్యగలరు.

రామచంద్రపురం, తేది: 31-08-2026.

V.GOPALARAO, సెల్: 9849146692
B.V.V.S.Kameswararao, Advocates
Ratnampeta, RAMACHANDRAPURAM

వాడపల్లి క్షేత్రంలో నేటి పూజలు

● కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరుని ఆలయంలో మంగళవారం ఉదయం 5 గంటలకు ప్రభాతసేవ, మేలుకొలుపు, వేంకటేశ్వర సహిత లక్ష్మీఐశ్వర్య హోమం, ద్రవిడ వేద పారాయణం, నివేదన ● 6 గంటలకు గోపూజ, అష్టోత్తర నామార్చన పూజలు, దర్శనాలు ప్రారంభం. 10.30 గంటలకు నిత్య కల్యాణం, 12 గంటలకు అర్చన ● మధ్యాహ్నం ఒంటిగంట నుంచి విరామం, 4 నుంచి మళ్లీ దర్శనాలు ప్రారంభం. ● సాయంత్రం 6 గంటలకు అర్చన, 7.30 గంటలకు నైవేద్యం. 8 గంటలకు పవళింపు సేవ.

– న్యూస్‌టుడే, ఆత్రేయపురం

సమస్యలు తెలుసుకోవడానికే ప్రజాదర్బార్

రామచంద్రపురం, న్యూస్‌టుడే: ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలు, సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి పరిష్కారం చూపడానికే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి ఆయన వినతిపత్రాలు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన పలువురు 39 అర్జీలను మంత్రికి అందించారు. తాగునీటి వసతి, విద్యుత్తు సమస్యలు, డ్రైనేజీ వ్యవస్థ, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై వచ్చిన వినతులను మంత్రి పరిశీలించి సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడారు.

వినతిపత్రం స్వీకరిస్తున్న మంత్రి సుభాష్

ప్రపంచ కొబ్బరి దినోత్సవం రేపు

అంబాజీపేట, న్యూస్‌టుడే: ప్రపంచ కొబ్బరి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 2న అంబాజీపేట ఉద్యాన పరిశోధన కేంద్రంలో వేడుకలు నిర్వహించనున్నట్లు ముఖ్య శాస్త్రవేత్త, ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతి పి.అశోక్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 4.15 గంటల వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్, కోస్టల్ జోన్-1 డి.వెంకటస్వామి, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ ఎస్.సూర్యకుమారితో పాటు పలువురు శాస్త్రవేత్తలు పాల్గొని కొబ్బరిపంట ఉత్పత్తి పెంపు, సాంకేతికతతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, తోటల సాగు, తెగుళ్లు, పురుగుల నివారణ తదితర అంశాలపై చర్చిస్తారని ఆయన వెల్లడించారు.

EENADU eClassifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ దర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). ✆ 8142292071.

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై మార్టిగేజ్ లోన్స్, Govt. ఎంప్లాయీస్, రిటైర్డ్ పెన్షనర్సుకు పర్సనల్ లోన్స్, స్థిరాస్తి ఏ బ్యాంక్‌లో ఉన్నా జిరాక్స్ పేపర్సుపై 2nd మార్టిగేజ్ లోన్. నోసిబిల్, అయోధ్య సొసైటి, Cell: 9666547338.

HEALTH & CARE

మద్యపానం మానేయడంఎలా? బరువు పెరుగుటకు, జాయింట్ పెయిన్స్‌కు రాజమండ్రి శ్రీ సాయిలక్ష్మీ లాడ్జి, SVG మార్కెట్ రోడ్, ఆర్‌టిసి బస్టాండ్ ఎదురుగా, ప్రతీనెల 3,17 తేదీల్లో మందులు.

REAL ESTATE

GENERAL

విశాఖపట్నం, మధురవాడ, సింహాచలం, ఆనందపురం, భోగాపురం ఏరియాల్లో ప్లాట్స్ కొనాలన్నా అమ్మాలన్నా సంప్రదించండి Cont: ✆ 8790921259.

PLOT FOR SALE

RAJAMAHENDRAVARAM CITY

రాజమండ్రి సిటీ 10వ వార్డులో తక్షణమే ఇంటి నిర్మాణానికి రుడా(RUDA) అప్రూవ్డ్ స్థలాలు అమ్మకమునకు కలవు. Contact Cell: 99122 15786.

TO LET

రాజమండ్రి-జాంపేట: ఎలక్ట్రికల్ ఆఫీసు వెనుక వీధిలో సుమారు 11'6"x11'2" గల రెండుషాపులు కలిపిగాని, విడిగా గాని అద్దెకు. సంప్ర. ✆ 63011 36401.

JOBS

Managers/Asst. Managers in Insurance Company is Above 40 yrs Salary 30K+ Others Contact Cell: 90108 09384.

Wanted Female HR Person for Hospital at Rajahmundry. Immediately Contact Cell: 76749 99909.

DEW FOAMS PRIVATE LIMITEDలో చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అర్హత: MBA 1-2 సం॥లు అనుభవం గల వార్కి ప్రాధాన్యత. రెజ్యూమ్ పంపవలసిన ఈ-మెయిల్: hodewfoamsegmail.com. Cont: ✆ 81795 19955.

శ్రీలక్ష్మీ వెంకటేశ్వరా వెహికల్ ఫైనాన్షియర్స్, తాడితోట నందు పనిచేయుటకు ఆఫీస్ స్టాఫ్ (35 సం॥), కలెక్షన్ బాయ్స్ (25 సం॥) కావలెను. సం: 96662 19999.

కాకినాడ LVM రెడ్ క్రాస్ ఐ బ్యాంకు నందు టెక్నీషియన్‌గా పనిచేయుటకు అనుభవం గల ఇంటర్ సైన్స్ పాసైన వారు కావలెను. Contact: 91826 60025, 0884-2371409.

RJY, KKD, అన్నవరంల్లో సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్స్ కావలెను. జీ॥ 12 to 15 వేలు. రూం+బో॥. రాజ్ సెక్యూరిటీ, దేవిచౌక్, రాజమండ్రి 9392269369, 9492144369.

నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్స్ టెక్నికల్ ఆపరేషన్స్‌లో అనుభవంగల M/F 8 మంది కావలెను. 2 సం॥ అనుభవం ఉండాలి. రాజమండ్రిలో నూతనంగా ప్రారంభించిన NBFC నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ హెడ్ ఆఫీస్ రాజమండ్రి నందు మాత్రమే పనిచేయుటకు కావలెను. అయోధ్య బిజినెస్ ఫైనాన్స్ Pvt. Ltd., ✆ 9100233999, 9866248160.

రాజమండ్రిలో హాస్పిటల్ నందు పనిచేయుటకు GNM/B.Sc. నర్సులు అర్జెంటుగా కావలెను. Contact Cell: 76749 99909/06.

రాజమండ్రిలో ప్రముఖ కన్‌స్ట్రక్షన్ ఆఫీసు నందు పనిచేయుటకు అకౌంటెంట్, సివిల్ ఇంజినీర్, సైట్ సూపర్‌వైజర్, రిసెప్షనిస్ట్ and PRO కావలెను. Contact Cell: 80991 91919.

EENADU for Advertisement Contact: 8008597607

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. **5-55** పై॥

అనపర్తి ఆఫీసు: 08857-226908

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

లాభాల్లో మునగంగ

వీబీజీ రామ్‌జీలో రైతులకు మొక్కల సరఫరా

న్యూస్‌టుడే, అంబాజీపేట

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అత్యధికంగా సాగుచేసే కొబ్బరితోటల్లో అంతరపంటగా పండించే మునగలో రైతులు లాభాలు ఆర్జించేలా ప్రభుత్వం చేయూతనందిస్తోంది. కొబ్బరితోటలతో పాటు ఖాళీ భూముల్లో ఈ పంటను సాగు చేసుకుని రైతులు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు వీబీజీ రామ్‌జీ పథకంలో రైతులకు మునగమొక్కలను ఉచితంగా సరఫరా చేస్తున్నారు. మార్కెట్‌లో మునగకాయలకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ఆధునిక విధానంలో సాగు చేసుకుని కర్షకులు లాభాలు పొందేలా ప్రోత్సాహం అందిస్తున్నారు.

కోనసీమలో సాగవుతున్న తోట

రెండేళ్ల పాటు రూ.96,000

అంతరపంటగా మునగను సాగుచేసే రైతులకు రెండేళ్ల పాటు రూ.96 వేలను వీబీజీ రామ్‌జీ పథకంలో అందిస్తున్నారు. కొబ్బరితోటల్లో అంతరపంటగా సాగుచేయడానికి వీలుగా ఎకరానికి 448 మునగ మొక్కలు సరఫరా చేస్తున్నారు. ఒక మొక్క రూ.8 చొప్పున పంట కాపునకు వచ్చే వరకు నిర్వహణ ఖర్చులతో కలిపి రెండు సంవత్సరాలకు రూ.96 వేల చొప్పున రైతు బ్యాంకు ఖాతాలో జమచేస్తారు. పంట చేతికి వచ్చిన తరవాత నుంచి మార్కెట్‌లో డిమాండ్, ధరలను బట్టి రైతులు లాభాలే ఆర్జిస్తారు. మరోవైపు మునగ తోట పెంపకంతో రైతులకు ఏమాత్రం నష్టం ఉండదు. వీటికి ప్రత్యేకించి పోషణ అవసరం లేదు. కొబ్బరితోటలకు పెట్టే సాగు నీరు, ఎరువులు, ఇతర పోషకాలు ఈ మొక్కలకు నేరుగా అందుతాయి కాబట్టి కర్షకులు పెద్దగా కష్టపడాల్సిన అవసరం ఉండదు. ప్రస్తుతం మార్కెట్‌లో ఒక మునగకాయ రూ.10 నుంచి రూ.12 వరకు విక్రయమవుతోంది. మొక్కనాటిన 6 నెలల నుంచి 8 నెలలకు కాపునకు వస్తుంది. ఇలా మూడు నుంచి అయిదేళ్ల పాటు కాపునిచ్చి రైతుకు ఆదాయం తెచ్చిపెడుతుంది. ఎకరా పొలంలో నాటిన చెట్ల నుంచి టన్నుల కొద్దీ మునగకాయలు దిగుబడి వస్తాయి. వీబీజీ రామ్‌జీలో సాగుకు నగదు జమ చేయడంతో రైతులకు ఆర్థికభారం కూడా ఉండదు. ఒక చెట్టుకు తొలి ఏడాదిలో 200 నుంచి 250 కాయలు, రెండో సంవత్సరంలో 350 నుంచి 500 వరకు కాయలు దిగుబడి వస్తాయి. ఎకరానికి ఏడాదిలో 10 నుంచి 15 టన్నుల దిగుబడి ఉంటుంది. అంటే సుమారు 2 లక్షల నుంచి 2.5 లక్షల కాయలు ఉత్పత్తి అవుతాయి. మార్కెట్‌లో ప్రసుతం కిలో ధర రూ.40 నుంచి రూ.55 వరకు పలుకుతోంది.

సూపర్ ఫుడ్..

మునగకాయలను సూపర్ ఫుడ్ లేదా ప్రకృతి ప్రసాదించిన దివ్యౌషధంగా పిలుస్తారు. కాయల కంటే ఆకుల్లోనే విటమిన్లు, ఖనిజాలు విటమిన్ ఏ, సీ, కాల్షియం, ఐరన్, పొటాషియం పుష్కలంగా ఉంటాయి. రోగ నిరోధక వ్యవస్థను బలపర్చడంలో ఇవి సాయపడతాయి. చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతాయి.

ఆసక్తిగల రైతులు సంప్రదించాలి..

కోనసీమ జిల్లాలోని కొబ్బరితోటల్లో అంతరపంటగా మునగ సాగుచేసేందుకు ఆసక్తి ఉన్న రైతులు నేరుగా కార్యాలయంలో సంప్రదించాలి. లేదా ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వీబీజీ రామ్‌జీ క్షేత్ర సహాయకులను కూడా సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు.

– అడపా శ్రీవెంకటకృష్ణ, ఏపీవో, అంబాజీపేట

ఆధార్‌కు తాళం వేయడం తెలుసా..?

న్యూస్‌టుడే, ఆత్రేయపురం

మీ కోసం

సైబర్ నేరాల నియంత్రణ, వ్యక్తిగత వివరాల గోప్యతకు ఆధార్‌కు తాళం వేయడం ఎంతో ఉపయోగపడుతుంది. తరచుగా సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతాలో నిల్వలు ఖాళీ చేస్తున్న ఘటనలు చూస్తున్నాం. అలాంటి నేరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ ఆధార్‌పై దృష్టిపెట్టి దాన్ని లాక్ చేసుకోవడం మంచిది. దీనివల్ల మీ వ్యక్తిగత వివరాలు నేరగాళ్ల చేతికి చిక్కవు. అలాగే దుర్వినియోగం చేయడానికి వీలుండదు.

ఏం చేయాలంటే..

ఆధార్‌కు తాళం వేయడానికి మీ చరవాణిని ఉపయోగించుకోవచ్చు. ముందుగా మై ఆధార్ యాప్‌లోకి వెళ్లాలి. హోం పేజీలో కనిపించే ఆధార్ లాక్, అన్ లాక్ యూఐబీ బటన్ ఎంపికచేయాలి. ఆధార్‌లోని 12 అంకెలు, పూర్తి పేరు, పిన్‌కోడ్, సెక్యూరిటీ కోడ్ నమోదు చేయాలి. అనంతరం సెండ్ ఓటీపీపై క్లిక్‌చేస్తే రిజిస్టర్ ఫోన్ నంబరుకు ఓటీపీ వస్తుంది. ఆ నంబర్‌ను నమోదు చేస్తే ఆధార్ లాక్ అవుతుంది.

ఇవీ ఉపయోగాలు..

ఆధార్‌ను లాక్ చేయడంలో వ్యక్తిగత సమాచారం, బయోమెట్రిక్ వివరాలు సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా సురక్షితంగా ఉంటాయి. మీ ఆధార్‌తో ఎవరైనా సిమ్ కార్డులు తీసుకోవడం, కొత్తగా బ్యాంకు ఖాతా తెరవడం కుదరదు. అలాగే ప్రభుత్వ రాయితీలను దుర్వినియోగం చేసేందుకు అవకాశం ఉండదు. అలాగే ఆధార్ జెరాక్స్ ఇతరుల చేతికి చిక్కినా ఎవరూ ఏమీచేయలేరు. వేలిముద్రలు, కంటిచూపు (ఐరిస్)తో లాక్ చేయడంతో అనుమతి లేకుండా ఎవరూ లావాదేవీలు నిర్వహించడానికి వీలుండదు. ఆధార్‌తో అనుసంధానం చేసిన పాన్‌కార్డు, ఓటర్ గుర్తింపుకార్డు, బ్యాంకు ఖాతాలకు రక్షణ లభిస్తుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ సమాచారం బహిర్గతం కాదు. అన్ని విధాలా వ్యక్తిగత వివరాలకు రక్షణ లభిస్తుంది.

పరీక్షల విధానాన్ని సమూలంగా సంస్కరించాలి

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: పాఠశాలల్లో పరీక్షల విధానాన్ని సమూలంగా సంస్కరించాలని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ వ్యాఖ్యానించారు. రామచంద్రపురం మండలం నరసాపురపుపేట జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉప్పలపాటి మాచిరాజు ఉద్యోగ విరమణ సందర్భంగా సోమవారం ఏర్పాటుచేసిన సత్కార సభలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ప్రస్తుత పరీక్షా విధానం మొక్కుబడిగా సాగుతోందని చెప్పారు. పరీక్షలంటే విద్యార్థులు ఎంతవరకు నైపుణ్యం సాధించారో తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సైన్స్ జీవితంలో ఒక భాగంగా మారాలని, అది సమస్యల పరిష్కారానికి హేతువు కావాలన్నారు. మరో ముఖ్యఅతిథి మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ విద్య జీవితంలో ఎదగడానికి ఒక ఆయుధంలా మారాలని చెప్పారు. అనంతరం హెచ్ఎం మాచిరాజు దంపతులను జయప్రకాశ్ నారాయణ, మంత్రి సుభాష్, పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు.

ప్రసంగిస్తున్న జయప్రకాష్ నారాయణ

యువతిని మోసం చేసిన కేసులో..
మాజీ కానిస్టేబుల్‌కు జైలు, జరిమానా

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన కేసులో మాజీ పోలీస్ కానిస్టేబుల్‌కు కోర్టు 12 ఏళ్ల 3 నెలల జైలుశిక్ష, రూ.7 వేలు జరిమానా విధించింది. కేసు వివరాలను ఎస్పీ రాహుల్ మీనా సోమవారం వివరించారు. రాజానగరం పరిధిలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబీఏ చదువుతున్న యువతికి 2022లో మలికిపురం మండలం లక్కవరం గ్రామానికి చెందిన కానిస్టేబుల్ ఉండ్రు అభిషేక్(29) ఇన్‌స్టాలో పరిచయమయ్యాడు. తనకు అర్థమెటిక్ సబ్జెక్ట్ తెలుసని స్టడీ మెటీరియల్ ఇస్తానని పరిచయం పెంచుకున్నాడు. తనను పెళ్లిచేసుకోకపోతే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించి బలవంతంగా తాళి కట్టాడు. శారీరకంగా దగ్గరైన తర్వాత మొహం చాటేశాడు. దీనిపై ఆ యువతి 2023, ఏప్రిల్ 17న అమలాపురం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ దుర్గాశేఖర్‌రెడ్డి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. అనంతరం సీఐ టి.క్రాంతికుమార్ కోర్టులో ఛార్జ్‌షీట్ వేశారు. నిందితుడిని 2024లో ఉద్యోగం నుంచి తొలగించారు. రాజమహేంద్రవరం కోర్టులో పీపీలు కె.రాధాకృష్ణరాజు, తుమ్మల వాసు వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో 8వ అదనపు జిల్లా సెషన్స్‌కోర్టు న్యాయమూర్తి బి.నిర్మల తీర్పు చెప్పారు. పట్టణ సీఐ వీరబాబు, డీఎస్పీ టీఆర్ఎస్‌కే ప్రసాద్, కోర్టు హెడ్ కానిస్టేబుల్ డి.మురళి, కోర్టు కానిస్టేబుల్ సురేష్‌ను అభినందించారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	16,000
పాతకాయ: గండేరా	23,500
గటగట	21,000
కొత్తకాయ: గండేరా	23,000
గటగట	20,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	19,000-21,000
కొత్త (పచ్చి) కాయ	20,000-21,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	5,000
కిలో	350

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారం రేటు	120-00
రిటైల్ లైవ్	147-00
డ్రెస్డ్	228-00
స్కిన్‌లెస్	257-00

ప్రాణాపాయం నుంచి బాలికను కాపాడిన వైద్యులు

భద్రాచలం, న్యూస్‌టుడే: ప్రాణాపాయ స్థితిలో ఉన్న గిరిజన బాలికకు భద్రాచలం ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి వైద్యులు అత్యవసర వైద్య సేవలు అందించి కాపాడారు. పోలవరం జిల్లా చింతూరు మండలం బొడ్డురాయిగూడెం గ్రామానికి చెందిన ఎస్.వెంకటలక్ష్మి(14) తీవ్ర అనారోగ్యంతో గత నెల 26న ఇక్కడి ఆసుపత్రిలో చేరింది. ఇక్కడ చేరక ముందు వారం నుంచి జ్వరం వచ్చి స్థానికంగా చికిత్స పొందింది. ఈ క్రమంలో ఒక్కసారిగా ఫిట్స్ వచ్చి తీవ్ర అస్వస్థతకు గురైంది. ఆరు రోజుల కిందట కుటుంబ సభ్యులు ఇక్కడకు తీసుకొచ్చినప్పుడు హిమోగ్లోబిన్ 2 గ్రాములు ఉంది. రక్తం తక్కువగా ఉండటంతో పాటు ఎలక్ట్రోలైట్ లెవల్స్ అసాధారణ స్థితిలో ఉన్నాయి. దీంతో శ్వాస తీసుకోలేక ఇబ్బంది పడింది. మెరుగైన వైద్యం కోసం వేరేచోటికి పంపించేందుకు ప్రయత్నించినప్పటికీ బాలిక కుటుంబ సభ్యుల పరిస్థితి కారణంగా ఇక్కడే ఉంచి అత్యంత క్రిటికల్ కేసుగా గుర్తించి సేవలందించారు. విడతలవారీగా అవసరమైన రక్తం ఎక్కించారు. ఫిట్స్ రాకుండా జాగ్రత్తలు పాటించారు. రక్తంలో షుగర్ స్థాయిలను నియంత్రించి కామెర్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. రెస్పిరేటరీ సపోర్ట్ వంటి చికిత్సలను అందించడంతో బాలిక ఆరోగ్యం కుదుటపడింది. నిపుణులైన ప్రభుత్వ వైద్యులపై ఆ కుటుంబం ఉంచిన నమ్మకంతో ఇది సాధ్యమైందని కోలుకున్న బాలికను సోమవారం డిశ్చార్జి చేశామని సూపరింటెండెంట్ డా.రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ వైద్య సేవలు అందించిన పిల్లల వైద్యుడు డా. క్రాపా విజయ్, నర్సింగ్ సిబ్బంది డా. రాజ్యలక్ష్మిలను అభినందించారు.

అత్యధిక మార్కులతో ప్రతిభ చాటాలి

మామిడికుదురు, న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థులు ఇప్పటి నుంచే అన్ని సబ్జెక్టులపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి అత్యధిక మార్కులు సాధించి జిల్లా స్థాయిలో ప్రతిభ చాటాలని డీఈవో షేక్ మహబూబ్‌బాషా అన్నారు. ఈదరాడ జడ్పీ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, అప్పుడే ఆరోగ్యం, పోటీల్లో పతకాలు సాధించగలరన్నారు. డీవైఈవో కిశోర్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు సాయిబాబా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు



ఈదరాడలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో మహబూబ్ బాషా

92.7 FM Rajamahendravaram

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

(c) eenadu

రాజోలు

• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

నిత్యాన్నదాన పథకానికి విరాళం

దాత కుటుంబ సభ్యులకు చిత్రపటాన్ని అందజేస్తున్న ఛైర్మన్ వెంకటరాజు

వాడపల్లి(ఆత్రేయపురం), న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామి నిత్యాన్నదాన పథకానికి రావులపాలేనికి చెందిన చంద్ర నాగహాసిని పేరిట ఆమె తల్లిదండ్రులు నల్లమిల్లి వెంకటచైతన్యరెడ్డి, సీతామహాలక్ష్మి దంపతులు రూ.1,00,116 విరాళాన్ని సోమవారం అందజేశారు. వీరికి స్వామి చిత్రపటం అందజేసి దేవస్థానం ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు అభినందించారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సంస్థ సభ్యులు

రాజోలు, న్యూస్‌టుడే: జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాలతో రాజోలు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆసుపత్రి ఐసీటీసీ కౌన్సిలర్ వి.ప్రతాప్ కుమార్, ప్రిన్సిపల్ శాంతికుమారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెచ్‌ఐవీపై అవగాహన కలిగి ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలన్నారు. అనంతరం వారికి కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు వితరణ

దాతకు స్వామివారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ధర్మకర్తల మండలి ఛైర్మన్

అయినవిల్లి, న్యూస్‌టుడే: అయినవిల్లి సిద్ధి వినాయకస్వామి ఆలయంలోని అన్నదాన ట్రస్టుకు సోమవారం అనపర్తి మండలం రామవరం గ్రామానికి చెందిన కర్రి వెంకటరెడ్డి, అరుణ దంపతులు రూ.1,11,111 విరాళం సమర్పించారు. వీరికి అర్చకులు తీర్థప్రసాదాలు, ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ సూర్యనారాయణ స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

ఆలయాల పునర్నిర్మాణానికి సహకారం

విరాళం అందజేస్తున్న దాత కుటుంబ సభ్యులు

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: ఆత్రేయపురంలో రాజరాజేశ్వరుడు, వేణుగోపాలస్వామి ఆలయాల పునర్నిర్మాణానికి కుచ్చెర్లపాటి పుల్లిరాజు, రమాదేవి దంపతుల పేరిట వారి కుటుంబ సభ్యులు జంపన రమణరాజు, సూర్యకుమారి దంపతులు రూ.50,101 విరాళాన్ని సోమవారం ఆలయాల నిర్మాణ పర్యవేక్షణ కమిటీ ప్రతినిధులకు అందించారు. ఛైర్మన్ వేగేశ్న ప్రసాదరాజు, పులవర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధికి ప్రభుత్వం కృషి

ట్రాక్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

రాజోలు, న్యూస్‌టుడే: మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. రాజోలు మండల మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన 'రైతు ఉత్పత్తిదారుల వ్యవసాయ సాగు అద్దె యంత్రాల బ్యాంకు'ను సోమవారం ఆయన ట్రాక్టరు నడిపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీదైన వ్యవసాయ యంత్రాలను రైతులకు మార్కెట్ ధరల కంటే తక్కువకు అద్దెకు ఇవ్వడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. రైతు వరినాట్లు నుంచి ధాన్యం సేకరణ వరకు అన్ని పరికరాలు లభిస్తాయన్నారు. చిన్న, సన్నకారు రైతులకు దీని వల్ల మేలు చేకూరుతుందన్నారు. డ్వాక్రా సంఘాల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం పాటుపడుతున్నారన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ పెద్దకాపు, ఏఎంసీ ఛైర్‌పర్సన్ వెంకటలక్ష్మి, ఎంపీపీ శ్రీదుర్గ, ఏఎంసీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

ట్యాంకులు కలుషితం.. అందని శుద్ధజలం

● నిర్వహణకు నోచుకోని తాగునీటి పథకాలు

మండలం	: ఆత్రేయపురం
పంచాయతీలు	: 17
నీటి పథకాలు	: 38
జనాభా	: 65 వేల మంది

న్యూస్‌టుడే, ఆత్రేయపురం

రంగుమారిన నీటి సరఫరా.. పాచిన కొళాయిలు.. ధ్వంసమైన ట్యాంకు మెట్లు.. అపరిశుభ్రంగా రక్షిత పథకం ఆవరణలు.. క్లోరినేషన్ చేయని ట్యాంకులు.. వీటి తోడు క్షేత్రస్థాయిలో పంచాయతీ, గ్రామీణ నీటి సరఫరా అధికారుల పర్యవేక్షణ కొరవడడం, సమన్వయలోపం కారణంగా ప్రజలకు శుద్ధజలం అందడం లేదు. రోగాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. ఆత్రేయపురం మండలంలోని పలు సంబంధిత గ్రామాల్లో పరిస్థితి ఇందుకు నిదర్శనం.

శుభ్రపరిచిన తేదీ లేని ట్యాంకు వద్ద గోడపై బోర్డు

మండలంలోని మొత్తం పంచాయతీల్లో 38 వరకు రక్షిత నీటి పథకాలు ఉన్నాయి. ఓవర్‌హెడ్ ట్యాంకుల శుభ్రతను 80 శాతం పంచాయతీల్లో అధికారులు విస్మరిస్తుండటంతో కలుషిత నీరు సరఫరా అవుతోంది. వాస్తవానికి గ్రామాల్లో తాగు నీటి ట్యాంకులను ప్రతి 15 రోజుకోసారి శుభ్రం చేయించాలని ప్రభుత్వం చెబుతున్నా.. చాలా పంచాయతీలు పట్టించుకోవడం లేదు. దీంతో కలుషిత నీరు పైపుల ద్వారా కుళాయిలకు సరఫరా అవుతోంది. రోగాలకు కారణం అవుతోంది. పలువురు బయట డబ్బులు చెల్లించి మంచినీటి టిన్లను కొనుగోలు చేసుకుంటున్నారు.

ఈనాడు పరిశీలన

కనిపించని వివరాలు..

సాధారణంగా బోర్ల నుంచి నీటిని ట్యాంకులకు ఎక్కించి క్లోరినేషన్ చేసి సురక్షిత తాగునీటిని ప్రజలకు అందించాలి. శుభ్రత లేకపోవడంతో ట్యాంకుల చుట్టూ పిచ్చిమొక్కలు, వ్యర్థాలు పేరుకుపోతున్నా పట్టించుకోవడం లేదు. పాత ట్యాంకులకు మూతలు శిథిలావస్థకు చేరుకోవడంతో వాటిలో దుమ్ము, ధూళి పడి నీరు అపరిశుభ్రంగా మారుతోంది. కొన్ని ట్యాంకులకు మెట్లు పాడవడంతో సిబ్బంది పైకి ఎక్కి శుభ్రం చేసేందుకు వీలుపడడం లేదు. మారిశెట్టిపాలెంలో ట్యాంకు మెట్లు దెబ్బతిన్నాయి. పథకాలను ఎప్పుడు శుభ్రం చేశారు, మళ్లీ ఎప్పుడు చేయాలనే వివరాలు అక్కడ బోర్డుపై నమోదు చేయడం లేదు. నిత్యం బ్లీచింగ్ లేదా ఆలంతో క్లోరినేషన్ చేయాల్సి ఉండగా అది జరగడం లేదు. పంచాయతీలకు సరఫరా చేసిన క్లోరినేషన్ కిట్లు కూడా వృథాగా పడి ఉంటున్నాయి. ర్యాలి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి రక్షిత నీటి పథకం నుంచి అప్పుడప్పుడు రంగు మారి వస్తోందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిర్వహణ లేని ఆత్రేయపురంలోని రక్షిత మంచినీటి పథకం

చర్యలు తీసుకుంటాం..

ఎప్పటికప్పుడు సమీక్ష సమావేశాల్లో పంచాయతీ సిబ్బందికి రక్షిత నీటి పథకాలు శుభ్రతపై సూచనలు చేస్తున్నాం. ఎక్కడైనా క్లోరినేషన్ కావడం లేదంటే వెంటనే చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. దెబ్బతిన్న పథకాలను కూడా పరిశీలించి మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. - రామ్ స్వరూప్, ఇన్‌ఛార్జి ఎంపీడీవో, ఆత్రేయపురం

నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం

కొత్తపేట, న్యూస్‌టుడే: గణపతి నవరాత్రి మహోత్సవాలకు కొత్తపేట కళానగర్‌లోని శ్రీ సిద్ధివినాయక ఆలయం ముస్తాబవుతోంది. ఇందులో భాగంగా సోమవారం కమిటీ ఆధ్వర్యంలో పందిరి రాట నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఈ ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పి.రామకృష్ణ, జి.పి.నాయుడు, భాస్కర్ రాజు, మోహన్‌కృష్ణ, రవిసత్యప్రదీప్ పాల్గొన్నారు.

ఘనంగా సంకటహర చతుర్థి పూజలు

ఆలమూరు, న్యూస్‌టుడే: సంకటహర చతుర్థి సందర్భంగా సోమవారం పెదపళ్ల బాలగణపతి, చింతలూరు, ఆలమూరు శ్రీలక్ష్మీగణపతి ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, పూజలు, గరిక అర్చనలు నిర్వహించారు. చింతలూరులో సంకటహరగణేశ హోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

పందిరి రాట ముహూర్త కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

కళానగర్‌లో వేంచేసియున్న గణపతి

పెదపళ్లలో బాలగణపతి

పలివెల ఆలయ అభివృద్ధికి కృషిచేస్తాం

కొత్తపేట, న్యూస్‌టుడే: దేవాలయం అభివృద్ధి చెందితే చుట్టుపక్కల ప్రాంతాలన్నీ అభివృద్ధి చెందుతాయని, పలివెల ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. సోమవారం పలివెల గ్రామంలో ఉమాకొప్పులింగేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇది అతి పురాతనమైన క్షేత్రమన్నారు. భక్తులకు నిర్వాహకుల సేవలు అభినందనీయమని అభినందించారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, మురళి, రాంబాబు, రామకృష్ణ, తాతాజీ పాల్గొన్నారు.

భక్తులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే బండారు, సిబ్బంది

డ్రాఫ్ట్ పాస్‌పుస్తకాలను సరిచూసుకోవాలి

పి.గన్నవరం, న్యూస్‌టుడే: పి.గన్నవరం, జి.పెదపూడి, లంకలగన్నవరం, నరేంద్రపురం గ్రామాల్లో భూముల రీసర్వే పూర్తయ్యిందని తహసీల్దార్ పి.శ్రీపల్లవి సోమవారం వెల్లడించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లో రైతులకు డ్రాఫ్ట్ ఈ-కేవైసీ ప్రక్రియ చేస్తున్నామన్నారు. రైతులు దీనికి సహకరించి వివరాలను సరిచూసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రక్రియ అనంతరం శాశ్వత పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తామన్నారు. ఈ నెల 4తో డ్రాఫ్ట్ ఈ-కేవైసీ పూర్తిచేస్తామని, ఈలోగా వివరాలను సరిచూసుకోవాలన్నారు.

సరకుల నిల్వ కేంద్రం తనిఖీ

అంబాజీపేట, న్యూస్‌టుడే: అంబాజీపేటలో ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉన్న పౌరసరఫరాల శాఖకు చెందిన మండలస్థాయి సరకుల నిల్వ కేంద్రాన్ని కొత్తపేట ఆర్డీవో జి.వి.వి.సత్యనారాయణ సోమవారం తనిఖీ చేశారు. బియ్యం, ఇతర నిల్వలను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ బి.చినబాబు, ఆర్ఐ ఏడుకొండలు ఉన్నారు.

ఓఎన్జీసీ సేవలు ప్రశంసనీయం

రాజోలు: రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తానని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. కళాశాలకు ఓఎన్జీసీ సమకూర్చిన 47 బల్లలు, 5 కంప్యూటర్లను సోమవారం ఆయన ప్రిన్సిపల్ పి.సాయిబాబుకు అందజేశారు. అనంతరం ప్రిన్సిపల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడాభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. ఓఎన్జీసీ సేవలను ప్రశంసించారు. రాజమండ్రి ఓఎన్జీసీ ఎసెట్ సీజీఎం రామారావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టి అనుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు. ఉప ప్రిన్సిపల్ నల్లి రాజు, లావణ్య, సరిత, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

కోనసీమలో మినీ విమానాశ్రయం నిర్మించాలి

అంతర్వేది: డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మినీ విమానాశ్రయాన్ని నిర్మించాలని భాజపా జిల్లా ఎస్సీమోర్చ ఉపాధ్యక్షుడు బి.నాగేశ్వరరావు కూటమి ప్రభుత్వాన్ని కోరారు. అంతర్వేది లక్ష్మీనరసింహస్వామిని సోమవారం దర్శించుకుని అనంతరం నియోజకవర్గ భాజపా శ్రేణులతో సమావేశమై ఈ క్షేత్రం అభివృద్ధికి కృషి చేస్తానని వెల్లడించారు. ఈ సందర్భంగా నాయకుడు పోతురాజు సురేష్ మాట్లాడుతూ వేలాది మంది గల్ఫ్ దేశాలకు ఈ ప్రాంతం నుంచి వెళ్లి పనిచేస్తున్నారని, ఇక్కడ ఎయిర్ పోర్టు నిర్మించాలన్నారు.

పునాదుల్లోనే సామాజిక భవనం

అంబాజీపేట మండలం వక్కలంక బాలయోగి కాలనీలో నిర్మించిన ఎస్సీ సామాజిక భవనం 15 ఏళ్లుగా అసంపూర్తిగా దర్శనమిస్తోంది. అప్పటి ఎంపీ జీవీ హర్షకుమార్ నిధులు కేటాయించారు. అనంతరం నిధుల కొరతతో నిలిచిపోయింది. ప్రస్తుతం పునాదుల్లో పిచ్చిమొక్కలు మొలిచాయి. కూటమి ప్రభుత్వంలోనైనా పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, అంబాజీపేట

పంటకాలువ దుస్థితి చూడు

అంబాజీపేట మండలం చిరుతపూడి నుంచి ఇసుకపూడి మీదుగా మాచవరం, గంగలకుర్రు వరకు సాగునీరు ప్రవహించే పంటకాలువ అధ్వానంగా మారింది. ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు పేరుకుపోయాయి. పిచ్చి మొక్కలు, తూడు విపరీతంగా ఉంది. దీంతో సాగునీరు పారని పరిస్థితి ఏర్పడింది. జలవనరులశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, అంబాజీపేట

సూచిక కనిపించక ఇక్కట్లు

అయినవిల్లి మండల కేంద్రం మెట్ల కాలనీ సమీపంలో ప్రధాన రహదారి పక్కనున్న సూచిక బోర్డు కనిపించక ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. దట్టంగా తుప్పలు, డొంకలు అల్లుకోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. పంచాయతీ అధికారులు పరిశీలించి తుప్పలను తొలగించి అక్కడున్న బోర్డును సరిచేయాలని అంతా కోరుతున్నారు. – న్యూస్‌టుడే, అయినవిల్లి

నిధులు కరవై.. అసంపూర్తిగా నిలిచి

మామిడికుదురు మండలం మొగలికుదురులోని అంబేడ్కర్‌నగర్ సమీపంలో ఏళ్లుగా అసంపూర్తి నిర్మాణంతో నిలిచిపోయిన అంగన్‌వాడీ భవనం నిరుపయోగంగా మారింది. దీనిని పూర్తి చేసేందుకు నిధులు మంజూరు కాకపోవడంతో ఆశించిన ప్రయోజనం దూరమైంది. పునాది క్రమంగా దెబ్బతింటోంది. ఈ విషయాన్ని పంచాయతీరాజ్ ఏఈ ఆనంద్ దృష్టికి తీసుకెళ్లగా దీని నిర్మాణానికి రూ.6.50 లక్షలు అవసరమని ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, మామిడికుదురు

వాలిన చెట్టుతో కలవరం

మామిడికుదురు మండలం కొమరాడ నుంచి ఈదరాడ వైపు వెళ్లే మార్గంలో ప్రధాన రహదారి మధ్య ఓ కొబ్బరి చెట్టు వాలి ఉండటంతో అటుగా రాకపోకలు సాగిస్తున్న వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. గాలి బలంగా వీచినప్పుడు చెట్టు ఊగిసలాడుతుండటంతో కలవర పడుతున్నారు. పక్కనే విద్యుత్తు స్తంభాలు ఉండటం వల్ల ఏ క్షణంలో ఇది విరిగి పడిపోతుందోనన్న భయం వెంటాడుతోంది. పంచాయతీ అధికారులు దృష్టిపెట్టి చెట్టును తొలగించే దిశగా చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు. – న్యూస్‌టుడే, మామిడికుదురు

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

రాజోలు, మామిడికుదురు: విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసే ఉద్యోగులకు తప్పక గుర్తింపు లభిస్తుందని జడ్పీ డీఎల్‌డీవో బుచ్చిరాజు, తహసీల్దార్ మల్లేశ్వరరావు అన్నారు. రాజోలు మండల పరిషత్తు కార్యాలయంలో పరిపాలనాధికారిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన మామిడిశెట్టి వెంకటసత్యనారాయణను నాయకులు, అధికారులు సత్కరించారు. ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఎంపీపీ శ్రీదుర్గ, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు. ● అంకితభావంతో విధులు నిర్వర్తిస్తే అందరి అభిమానం పొందుతారని ఏలూరు జిల్లా ప్రత్యేక ఉప కలెక్టర్ ముక్కంటి అన్నారు. అప్పనపల్లి వీఆర్వోగా పనిచేసి విరమణ చేసిన కాదంబరి అన్నపూర్ణరావుకు మామిడికుదురులో సన్మానించారు. తహసీల్దారు సీఎస్ రాజు, మాజీ ఎమ్మెల్యే ఎం.ఎ.వేమా తదితరులు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి దాతల సహకారం

స్పోర్ట్స్ దుస్తులతో ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు

మలికిపురం, న్యూస్‌టుడే: మేడిచర్లపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు దాతలు క్రీడా దుస్తులు సమకూర్చారు. ప్రధానోపాధ్యాయుడు ఆరేటి త్రిమూర్తులు స్నేహితుడు బోణం సాయిరమేశ్(భీమవరం సీఐ), వ్యాయామోపాధ్యాయుడు కట్టా కృష్ణప్రసాద్ తన తండ్రి కట్టా సూర్యనారాయణ పేరుతో 34 మందికి క్రీడాదుస్తులు సమకూర్చారు. పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో వీటిని మాజీ సర్పంచి పురుషోత్తమరావు, రామలింగేశ్వరరావు చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు త్రిమూర్తులు, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, సాయిబాబు, కె.లక్ష్మి, ఎ.విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాదరణతో రెండేళ్లలో ప్రగతి సాకారం

నగరంలో కరపత్రాలు ప్రదర్శిస్తు కేకు కోస్తున్న తెదేపా నాయకులు

మామిడికుదురు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రెండేళ్ల కాలంలోనే ప్రజాదరణతో అన్నివిధాలా ప్రగతిని సాకారం చేసిందని, ఇచ్చిన హామీలను నెరవేర్చిందని తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు బోనం బాబు అన్నారు. నగరంలో ఇంటింటికీ తెదేపా వంద శాతం పూర్తయిన సందర్భంగా సోమవారం జరిగిన కార్యక్రమంలో వివిధ పథకాల వివరాలతో ఉన్న కరపత్రాలను ప్రదర్శిస్తూ కేకు కోసి అందరికీ పంచారు. పి.గన్నవరం నియోజకవర్గం ఎస్సీ విభాగం నాయకుడు సుబ్బారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ సర్పంచి రమణకుమారి, సురేష్, అబ్బాస్ పాల్గొన్నారు.

సర్కారు బడి.. భద్రత ఏదీ?

ప్రహరీలు లేక ఇబ్బందులు

న్యూస్‌టుడే, ఆత్రేయపురం: మండల పరిధిలోని పలు పాఠశాలలకు భద్రత కరవైంది. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 53 ఉండగా వాటిలో 2700 మంది విద్యార్థులు చదువుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పథకంలో భాగంగా విద్యాలయాల రూపురేఖలు మార్చామంటూ గొప్పలు చెప్పుకొన్నారు. అయితే ఆ పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. అత్యంత కీలకమైన ప్రహరీల నిర్మాణం పట్టించుకోలేదు.

కొన్ని చోట్ల ఇలా..

● మెర్లపాలెం ఎస్సీపేట వద్ద ఉన్న రెండు ప్రాథమిక పాఠశాలల చెంతన పంట కాలువలు, ఇదే గ్రామంలో కొత్తపాలెం పాఠశాల పక్క చెరువు ఉంది. ప్రస్తుతం నీటి ప్రవాహంతో అవి ప్రమాదకరంగా ఉన్నాయి. ● ఆత్రేయపురం ఎస్సీపేటలో ఉన్న పాఠశాల మురుగు కాలువకు ఆనుకొని ఉంది. గతంలో ఈ డ్రెయిన్‌లో పడి ఒక బాలుడు మృతి చెందాడు. ● మెర్లపాలెం జడ్పీ పాఠశాలకు ప్రహరీ నిర్మించేందుకు అవసరమైన స్థలం లేదు. ● ర్యాలి జడ్పీ పాఠశాలకు కొంత వరకే ప్రహరీ ఉంది. సెలవు రోజుల్లో ఆకతాయిలు ఇక్కడ తిష్ఠ వేస్తున్నారు. తరగతి గదుల్లోకి రాళ్లు విసురుతున్నారు. సమస్యలు విద్యాశాఖాధికారి ప్రసాదరావు దృష్టికి తీసుకెళ్లగా ప్రహరీల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరు కావాల్సి ఉందన్నారు.

కొత్తపాలెంలో ప్రహరీ లేని ప్రాథమిక పాఠశాల

ఉత్తమ కుంగ్‌ఫూ మాస్టర్‌కు అభినందనలు

ఆలమూరు, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో సీనియర్ కుంగ్‌ఫూ మాస్టర్ కందన్‌గౌడ్ రాము ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి జరిగిన కుంగ్‌ఫూ కరాటే మాస్టర్ల అయిదో వార్షికోత్సవ ఐక్యవేదికలో కోనసీమ జిల్లా ఉషు సెక్రటరీ కె.సత్తిబాబుకు ఉత్తమ కుంగ్‌ఫూ మాస్టర్ అవార్డు లభించింది. తెలంగాణ విక్టోరియా చోటాఖాన్ కరాటే ఫౌండర్ మల్లికార్జున గౌడ్ చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం సత్తిబాబును స్వస్థలం జొన్నాడలో గ్రామ పెద్దలు, ప్రముఖులు అభినందించారు. కార్యక్రమంలో ఎంఎంటీ టీం మాస్టర్స్ వెంకట్, విక్రమ్, రాజబాబు, మురళి, నాగరాజు పాల్గొన్నారు.

సత్తిబాబును సత్కరిస్తున్న కుంగ్‌ఫూ మాస్టర్లు

ఆక్రమణలపై పూర్తిస్థాయిలో సర్వేకు వినతి

తహసీల్దార్, ఎంపీడీవోలకు సమస్యలు విన్నవిస్తున్న అర్జీదారులు

మామిడికుదురు, న్యూస్‌టుడే: మండలంలోని నగరం గ్రామంలో ముస్లిం వీధిలో రహదారి ఆక్రమణలపై పూర్తి స్థాయిలో సర్వే చేసి రాకపోకలు పునరుద్ధరించాలని స్థానికులు మామిడికుదురులోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం అధికారులకు విన్నవించారు. దీనిపై తాము పలుమార్లు అర్జీలు పెట్టినా ప్రయోజనం లేదని బత్తుల సురేష్‌బాబు, విప్పర్తి గణపతిరావు, పెచ్చెట్టి చంద్రరావు, బొంతు ఏడుకొండలు వాపోయారు. స్థానికంగా ఉన్న బీసీ శ్మశాన వాటికలో ఆక్రమణలు తొలగించేలా చర్యలు చేపట్టాలని కోరారు. పాశర్లపూడిలోని సంతపేటలో ప్రభుత్వ స్థలం ఆక్రమణలకు గురైందని, వీటిని పూర్తిగా గుర్తించి వెంటనే తొలగించాలని కోరుతూ స్థానిక సానబోయిన సత్యనారాయణ వినతిపత్రాన్ని అందజేశారు. స్పందించకుంటే ఆందోళన చేస్తామన్నారు. వీటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు సీఎస్ రాజు, ఎంపీడీవో జి.నవ్యభవాని తెలిపారు.

మాతృభాష పరిరక్షణకు కృషి చేయాలి

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: మాతృభాష పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, తెదేపా సాంస్కృతిక శాఖ జిల్లా అధ్యక్షుడు ఆనందరెడ్డి అన్నారు. రావులపాలెంలోని సీఆర్సీలో ప్రగతి భారతం ట్రస్టు, మాతృభాష పరిరక్షణ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో శతక పద్య సహస్ర గలార్చన వేమన శతకం కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ట్రస్టు ఛైర్మన్ తమనంపూడి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో 22 పాఠశాలలకు చెందిన 1,008 మంది చిన్నారులు పాల్గొని వేమన శతకంలోని 108 పద్యాలను ఆలపించారు. కార్యక్రమానికి అతిథులుగా ఎమ్మెల్యేలు హాజరై మాట్లాడారు. ఇలాంటి కార్యక్రమాలతో చిన్నారుల్లో తెలుగు భాషపై ఆసక్తిని పెంచడంతో పాటు, మన సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడాలనే సందేశం ఉంటుందన్నారు. అనంతరం తెలుగు భాషకు కృషి చేసినందుకు గానూ ట్రస్టు సభ్యురాలు, అహల్యా ఐవీఎఫ్ ఆసుపత్రి డైరెక్టర్ శనక్కాయల రాజకుమారికి సేవా అవార్డును అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యుడు ఉమాశంకర్, పరిరక్షణ కార్యదర్శి నాగభూషణం పాల్గొన్నారు.

రాజకుమారికి అవార్డు అందిస్తున్న సంస్థ ఛైర్మన్ తదితరులు

ఆర్థిక సాయం అందజేత

రాజోలు, న్యూస్‌టుడే: మండలంలోని ములికిపల్లికి చెందిన పితాని భవానికి విద్యార్థి సంఘాల నాయకులు ఆర్థిక సాయం అందించారు. భవాని పెళ్లి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు మొత్తాన్ని సోమవారం అందజేశారు. పెళ్లి అనంతరం ఆమె చదువుకునేందుకు బాసటగా నిలుస్తామన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు గణేష్, పవన్‌నాయుడు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

అంబాజీపేట: ఈ ఏడాది ఏప్రిల్ 14న అంబాజీపేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ముత్తాబత్తుల నాగేంద్రబాబు కుటుంబ సభ్యులను సోమవారం అంబాజీపేట మండల మాల మహానాడు ప్రతినిధులు పరామర్శించారు. మృతుడి భార్య సత్యకు రూ.36,800 అందజేశారు. మండల మాలమహానాడు ప్రతినిధులు నాగరాజు, వీరవెంకటసత్యనారాయణ, ఎమాజీ సర్పంచి చిన్న పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో పేదలకు లబ్ధి

అంబాజీపేటలో కరపత్రం అందజేస్తున్న తెదేపా నాయకులు

అంబాజీపేట, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ పాలనలో నిరంతరం అభివృద్ధి జరుగుతుందని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు, పి.గన్నవరం నియోజకవర్గ కోకన్వీనర్ దాసరి వీరవెంకటసత్యనారాయణ అన్నారు. అంబాజీపేటలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని క్లస్టర్ ఇన్‌ఛార్జి గణపతి వీరరాఘవులు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. రెండేళ్ల కాలంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. కరపత్రాలు అందజేశారు. మండల పార్టీ అధ్యక్షుడు గూడాల ఫణి, తెలుగు యువత అధ్యక్షుడు జోగి కృష్ణచైతన్య, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, దొమ్మేటి శ్యామ్, కొప్పినీడి ఈశ్వరరావు, యాగన రాము పాల్గొన్నారు.

సేవలతో గుర్తింపు అభినందనీయం

వీర్రాజును సత్కరిస్తున్న ఎంపీడీవో రాజు, ఎంపీపీ తోరాటి

ఆలమూరు, న్యూస్‌టుడే: డిప్యూటీ ఎంపీడీవో వీర్రాజు సేవలు అభినందనీయమని వక్తలు కొనియాడారు. సోమవారం ఆయన ఉద్యోగ విరమణ సందర్భంగా ఆలమూరు మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో నిర్వహించిన సత్కార సభలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. పంచాయతీ కార్యదర్శిగా పలు గ్రామాల్లో సేవలందించి ఇటీవలే డిప్యూటీ ఎంపీడీవోగా ఉద్యోగోన్నతి పొంది సేవలందిస్తున్నారన్నారు. అనంతరం వీర్రాజు దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజు, ఏజీపీ విద్యాప్రసన్న, పంచాయతీ కార్యదర్శి వేణి, అధికారులు పాల్గొన్నారు.

(c) eenadu

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం • రామచంద్రపురం

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

యానాం: యానాం రీజెన్సీ పబ్లిక్ హైస్కూల్లో సోమవారం ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. మూడు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు వివిధ నమూనాలను తయారు చేసి ప్రదర్శించారు. ప్రదర్శనను రీజెన్సీ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మార్గాండ ప్రసాద్ ప్రారంభించారు. హెచ్‌ఎం ప్రసాదరావు, ఉపాధ్యాయులు క్రాంతికుమార్, అశ్విని, వరలక్ష్మి, రహిమా, ఉషారామలక్ష్మి, భాస్కరమణి పాల్గొన్నారు.

రైతుబజార్లో ధరలు (కిలోకు)

అమలాపురం పట్టణం: టమాటా - 22, 25, వంకాయలు నలుపు - 40, తెలుపు - 30, దొమ్మెర - 40, బెండకాయలు - 17, పచ్చిమిర్చి - 40, కాకరకాయ - 30, బీరకాయలు - 32, 38, క్యాబేజీ - 33, క్యారెట్ - 35, దొండకాయలు - 32, బంగాళదుంపలు - 20, ఉల్లిపాయలు - 46, 55, గోరుచిక్కుళ్లు - 34, దోసకాయలు - 23, చిక్కుడుకాయలు - 40, 100, చేమదుంపలు - 43, కంద - 40, బీట్‌రూట్ - 43, కీరదోసకాయలు - 40, అల్లం - 100, 150, క్యాప్సికం - 70, చిలకడ దుంపలు - 50, 60, గుమ్మడి - 35, 45, ముల్లంగి - 45, కరివేపాకు - 50, నిమ్మకాయలు - 80, 100. ● ఆనబకాయ - 10, 15, పొట్లకాయ -22, అరటికాయ - 6, మునగకాయ - 8, 10, ఆకుకూరల కట్ట - 10, 15, కొత్తిమీర కట్ట - 20, మామిడికాయ - 8, 10.

రాష్ట్ర హోదాతో ప్రయోజనం: మల్లాడి

అసెంబ్లీలో మాట్లాడుతున్న మంత్రి కృష్ణారావు

యానాం, : పుదుచ్చేరికి రాష్ట్ర హోదా ఇస్తే అనేక ప్రయోజనాలు ఒనగూరుతాయని ప్రజా పనుల శాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు స్పష్టం చేశారు. సోమవారం పుదుచ్చేరి అసెంబ్లీలో స్పీకర్ అనుమతితో రాష్ట్ర హోదా అంశంపై కృష్ణారావు మాట్లాడారు. పుదుచ్చేరి, కారైకాల్, మాహే, యానాం ప్రాంతాలను కలిపి రాష్ట్రహోదా కల్పించాలనే డిమాండ్‌కు పూర్తిగా మద్దతు ప్రతిపాదిస్తున్నామన్నారు. కేంద్రంలో, పుదుచ్చేరిలో ఒకే ప్రభుత్వం పాలన ఉన్నందున... ప్లానింగ్ మిషన్‌లో రాష్ట్రానికి బోట్లు కల్పించేలా సీఎం రంగసామి చొరవ చూపాలని కోరారు.

పుదుచ్చేరి అభివృద్ధిపై కేంద్రానికి విన్నపం

రానున్న ఐదేళ్లలో పుదుచ్చేరిలో చేపట్టే అభివృద్ధి పనులకు రూ.4,200 కోట్ల నిధులు కేటాయించాలని కేంద్రాన్ని కోరనున్నట్టు ప్రజా పనులు, పర్యాటక శాఖల మంత్రి మల్లాడి కృష్ణారావు ప్రకటించారు. ఆయన అసెంబ్లీలో మాట్లాడారు. పుదుచ్చేరితో పాటు కారైకాల్, మాహే, యానాం ప్రాంతాల్లో పర్యాటక ప్రాజెక్టులు, జిప్‌మెర్ ఆసుపత్రి నిర్మాణం, విస్తరణ కోసం కేంద్ర పర్యాటక శాఖ, ఆరోగ్య శాఖ మంత్రులను కలిసేందుకు దిల్లీ వెళ్లనున్నట్టు తెలిపారు. 2026-27 వార్షిక బడ్జెట్ సమావేశాలు సోమవారంతో ముగిశాయి.

వేదన వినాలి.. పరిష్కారం చూపాలి

పీజీఆర్ఎస్‌లో అర్జీలు

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

తమ సమస్యలను పరిశీలించి అధికారులు పరిష్కారం చూపాలని పలువురు వినతులు అందజేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులు అధికారుల వద్ద తమ గోడు వెల్లబుచ్చుకున్నారు. వినతులను పరిశీలించి సకాలంలో పరిష్కరించేలా చూస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

ఎస్సీల్లో చేర్చాలని వినతి

రజక వృత్తి ద్వారా జీవనోపాధి పొందుతున్నాం. 1985లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ రజకులను ఎస్సీల్లో చేర్చే విధంగా కేంద్రానికి సిఫార్సు చేశారు. తర్వాత 2024 ఎన్నికల హామీల్లో భాగంగా ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆ హామీకి కట్టుబడి ఉన్నామని ప్రకటించారు. ఇదే విషయాన్ని మ్యానిఫెస్టోలో సైతం పొందుపరిచారు. ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మాకు న్యాయం చేయాలని కోరుతున్నాం.

-రజక ఎస్సీ సాధన కమిటీ సభ్యులు

టీసీ ఇవ్వకుండా దూషిస్తున్నారు

మాది అమలాపురం మండలం పేరూరు పేట. 13 ఏళ్లపాటు అమలాపురం పరిధిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించాం. ఆ సయంలో మా పిల్లలకు ఉచిత ప్రవేశం కల్పించారు. ప్రస్తుతం 8, 10 తరగతులు చదువుతున్నారు. మేం ప్రస్తుతం అక్కడ విధులు నిర్వహించడం లేదు. పిల్లల టీసీలు ఇవ్వాలని అడుగుతుంటే కులం పేరుతో దూషిస్తూ దుర్భాషలాడుతున్నారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

-పాలెపు వెంకటరమణ, శ్రీలలిత

అర్హత ఉన్నా దక్కని భరోసా

మాది ఉప్పలగుప్తం మండలం ఎన్.కొత్తపల్లి. మా కుమారుడు సత్యవెంకట్‌కు ఎనిమిదేళ్లు. పుట్టిన నుంచి వైకల్యంతో బాధపడుతున్నాడు. కదలలేని పరిస్థితిలో ఉన్నాడు. సొంతంగా కాలకృత్యాలు సైతం తీర్చుకోలేని పరిస్థితి. దివ్యాంగ పింఛను కోసం సదరం ధ్రువీకరణ పత్రానికి దరఖాస్తు చేయగా వైకల్యం తాత్కాలికం అని మంజూరు చేశారు. దీంతో పింఛను సౌకర్యం అందకుండా పోతోంది. రోజూ ఒకరు తన వెంట ఉండాల్సిందే. ఆర్థికంగా తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. ఉన్నతాధికారులు ఆదుకోవాలి.

-పట్టా నరసింహమూర్తి

పథకాలకు దూరం..

జిల్లాలో దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి. కొన్నాళ్లుగా మాలో అర్హులైన వారు పింఛను, ఇతర ప్రభుత్వ పథకాలకు దూరం అవుతున్నారు. ఈ సమస్యల్ని పరిష్కరించాలని అధికారులకు వద్దకు వెళుతున్నా పట్టించుకోవడం లేదు. సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లేందుకు వచ్చాం. అర్హులైన వారికి రూ.15 వేలు పింఛను అందించాలి. ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రత్యేక కోటా ప్రకటించాలి.

-పీడబ్ల్యూడీ ఫెడరేషన్ సభ్యులు

కేసుల పరిష్కారంలో మధ్యవర్తిత్వంతో మేలు

న్యాయమూర్తి వెంకటేశ్వరరావు నుంచి ధ్రువపత్రం అందుకుంటున్న కుమారస్వామి

రామచంద్రపురం, న్యూస్‌టుడే: మధ్యవర్తిత్వం (మీడియేషన్)పై శిక్షణపొందిన న్యాయవాదులు సన్నపు బాలసుబ్రహ్మణ్య కుమారస్వామి, బి.శ్రీనివాసరావులకు రామచంద్రపురం 13వ అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు ఆవరణలో జడ్జి బి.హెచ్.వి.లక్ష్మీకుమారి ధ్రువపత్రాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జడ్జి లక్ష్మీకుమారి మాట్లాడుతూ కేసుల పరిష్కారంలో మధ్యవర్తిత్వమే మేలని, తద్వారా కక్షిదారులకు సమయం, సొమ్ము ఆదా అవుతాయని చెప్పారు. ఇందులో ఎవరూ ఓడిపోరని, ఇద్దరూ గెలిచినట్లే భావించాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకటేశ్వరరావు, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నీలం మధుసూదనరావు, లోక్ అదాలత్ సిబ్బంది సుభాషిని పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష జేఏవో బదిలీ

ముమ్మిడివరం, న్యూస్‌టుడే : జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్ విభాగంలో జూనియర్ అకౌంట్స్ అధికారి(జేఏఓ)గా విధులు నిర్వహిస్తున్న జి.ప్రవీణ్‌కుమార్ రాష్ట్ర ట్రెజరీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. సోమవారం ఆయన్ను సమగ్ర శిక్ష ఏపీసీ జి.మమ్మీ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది సత్కరించి వీడ్కోలు పలికారు. ఎఫ్ఏఓ షేక్ సలీం ఖాన్, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్.సుబ్రహ్మణ్యం, సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు బీవీవీ.సుబ్రహ్మణ్యం, డి.రమేష్‌బాబు, పి.రాంబాబు పాల్గొన్నారు.

సత్తెమ్మతల్లి ఆలయానికి శంకుస్థాపన

పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు దంపతులు

ఉప్పలగుప్తం: ఎస్.యానాం ఆంధ్రా గోవా కోకోబీచ్‌లో సత్తెమ్మతల్లి ఆలయ నిర్మాణానికి అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు దంపతులు సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్.యానాన్ని పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఎస్.యానాం బీచ్‌లో పర్యాటకులు, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తామన్నారు. పూజాది కార్యక్రమాల్లో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, కూటమి నాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

రక్తపింజరి కలకలం

ముమ్మిడివరం, న్యూస్‌టుడే : ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధి 216 జాతీయ రహదారి సమీప కాశీవారి తూము ప్రాంతంలో సోమవారం రక్తపింజరి కలకలం సృష్టించింది. స్థానికంగా పామును చూసిన వారు భయాందోళనతో పరుగులు తీశారు. స్నేక్ క్యాచర్‌కు గణేష్‌వర్మకు సమాచారం ఇవ్వడంతో, ఆయన వచ్చి జేసీబీ సాయంతో తుప్పల్ని తొలగించి, పామును చాకచక్యంగా డబ్బాలో బంధించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నిరసన తెలుపుతున్న ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ నాయకులు

అమలాపురం కలెక్టరేట్: అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామన్న ఎన్నికల హామీని కూటమి ప్రభుత్వం అమలు చేయాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వారు కలెక్టరేట్ వద్ద నిరసన ప్రదర్శన చేశారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో 8 లక్షల మంది ఉద్యోగుల ప్రయోజనం కోసం ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు చేస్తున్న ఉద్యమాన్ని కొంత మంది కావాలనే అపహాస్యం చేస్తున్నారన్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించి సమస్యలను పరిష్కరించాలని, బకాయిలు తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమరావతి జేఏసీ అధ్యక్షుడు వాసా దివాకర్, దేవల శ్రీనివాస్, మద్దాల బాపూజీ, స్వామి నాయుడు, వీఆర్వోలు, అధికారులు పాల్గొన్నారు.

డిప్యూటీ డీఎంహెచ్‌వోకు బదిలీ

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: డిప్యూటీ డీఎంహెచ్‌వో సీహెచ్‌వీ భరతలక్ష్మిని పశ్చిమగోదావరి జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిణిగా ప్రభుత్వం నియమించింది. సోమవారం రాత్రి ఈ మేరకు ఉత్తర్వులు వెలువడ్డాయి.

సేవలు ప్రశంసనీయం

రమణ కుమారిని సత్కరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్ రెవెన్యూ సెక్షన్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన పుల్ల వెంకట రమణకుమారి సేవలు ప్రశంసనీయమైన కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆమెను అధికారులు సత్కరించారు. డీఆర్వో సుబ్బారావు మాట్లాడుతూ విధుల పట్ల అంకిత భావంతో ఉండేవారన్నారు. ఏవో నాగలక్ష్మమ్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

పోటీల్లో పతకాలు అందుకున్న క్రీడాకారులు

రామచంద్రపురం : జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఆగస్టు 29న కాకినాడ పీఆర్ కళాశాలలో నిర్వహించిన క్రీడా పోటీల్లో రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. విద్యార్థిని పి.చంద్రకళ లాంగ్‌జంప్‌లో ప్రథమస్థానం, జి.లక్ష్మి షాట్‌పుట్‌లో ప్రథమస్థానం, జి.రాజేష్ లాంగ్‌జంప్‌లో ద్వితీయ స్థానం, సుమంత్ షాట్‌పుట్‌లో తృతీయ స్థానం, జి.రాజు 100 మీటర్ల పరుగు పందెంలో తృతీయస్థానంలో నిలిచారని ప్రిన్సిపల్ డా.కె.చిట్టిబాబు చెప్పారు. విద్యార్థులతో పాటు వారికి శిక్షణ ఇచ్చిన పీడీ పి.నూకరాజును సోమవారం కళాశాలలో ఆయన అభినందించారు.

దాతల సాయం.. నెరవేరని లక్ష్యం

రామచంద్రపురం మండలం అన్నాయిపేట గ్రామంలో రోటరీ క్లబ్ సౌజన్యంతో జల కల్యాణం పేరిట ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్ నిర్వహణ కొరవడి మూలకు చేరింది. దాదాపు ఏడాది క్రితం పంచాయతీ పాలకవర్గం ప్రోత్సాహంతో ఎంపీపీ పాఠశాల స్థలంలో దీన్ని నెలకొల్పారు. ప్రారంభించిన కొత్తలో గ్రామస్థులు ప్లాంట్ నుంచి శుద్ధ జలాలను ఉచితంగా తీసుకువెళ్లేవారు. ప్రస్తుతం మోటార్ పాడయిపోయి ప్లాంట్ పనిచేయడం లేదు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయిస్తే గ్రామస్థులకు ఉపయుక్తంగా ఉంటుందని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ద్రాక్షారామ

శ్రమదానంతో గుంత పూడ్చివేత

అమలాపురం- రావులపాలెం ప్రధాన రహదారిలో కొత్తపేట మండలం మోడికుర్రు వద్ద భారీ గుంత ఏర్పడింది. ఆ ప్రాంతంలో వాహనచోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. అక్కడి పరిస్థితిని గమనించిన కొందరు యువకులు సోమవారం రాత్రి శ్రమదానం చేసి దానిని పూడ్చివేశారు. సమీపంలోని కంకర, మెటల్‌ను బస్తాలతో తరలించి గుంతలో పోశారు. వారిని పలువురు అభినందించారు. –న్యూస్‌టుడే, కోనసీమ

భయం భయంగా రాకపోకలు

అమలాపురం పట్టణంలో రహదారులపై పశువులు దర్శనమిస్తున్నాయి. బస్టాండ్ రోడ్డు, నల్లవంతెన బైపాస్‌రోడ్డు, సినిమారోడ్డు, కె.అగ్రహారం, కాలేజీరోడ్డు, హైస్కూల్ సెంటర్ ఇలా ప్రతి రహదారిపై ఆవులు, ఆబోతులు తిష్ట వేస్తున్నాయి. ఆ మార్గంలో వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వారంతా భయపడుతున్నారు. ఈ సమస్యను పురపాలక అధికారుల దృష్టికి తీసుకెళ్లగా పశువులను రోడ్లపై వదిలే యజమానులకు జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

ఎన్నికల్లో దివ్యాంగులకు రిజర్వేషన్ ఇవ్వాలి

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక ఎన్నికల్లో దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించాలని దివ్యాంగ్ మహాసంఘటన్ జాతీయ అధ్యక్షుడు నండూరి రమేష్ డిమాండ్ చేశారు. అమలాపురం పీఆర్ అతిథిగృహంలో కోనసీమ దివ్యాంగ జేఏసీ, దివ్యాంగ్ మహాసంఘటన్, పీడబ్ల్యూడీ సంఘ నాయకుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న దివ్యాంగుల పింఛన్లు మంజూరు చేయాలని, దివ్యాంగులకు మూడు చక్రాల మోటారు వాహనాలను ఇవ్వాలని కోరారు. శంకరరావు, నిమ్మకాయల సురేష్, వెంకటప్రసాద్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: అమలాపురం సబ్‌డివిజన్ పరిధిలో సెప్టెంబరు నెలలో సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నట్లు డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ సోమవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు వంటివి నిషేధమన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు సహకరించాలని కోరారు.

స్తంభాన్ని ఢీకొట్టిన కారు

అమలాపురం పట్టణం: కొంకాపల్లి ఎత్తురోడ్డు వద్ద సోమవారం తెల్లవారుజామును ఓ వ్యక్తి కారుతో విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టారు. స్వల్పగాయాలతో కారులోని వారు బయటపడ్డారు. ప్రమాద తీవ్రతకు విద్యుత్తు స్తంభం విరిగి పక్కన పడిపోయింది. విద్యుత్తు సరఫరా నిలిపివేయడంతో స్థానికులు అవస్థలు పడ్డారు. గాయపడిన వారిని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పట్టణ సీఐ వీరబాబు మాట్లాడుతూ ఫిర్యాదు అందలేదని తెలిపారు.

జనంలోకి జన సైనికులు

రామచంద్రపురం : పట్టణంలోని 17వ వార్డు పరిసర ప్రాంతాల్లో జనంలోకి జన సైనికులు కార్యక్రమం నిర్వహించారు. జన సైనికులు, వీర మహిళలు, స్థానిక కార్యకర్తలు, అభిమానులు స్థానికంగా పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఇంటింటికి వెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నియోజకవర్గం ఇన్‌ఛార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జన సైనికులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న యువకుడి అరెస్టు

కాట్రేనికోన న్యూస్‌టుడే : చోరీ చేసిన ద్విచక్ర వాహనంపై గంజాయి తరలిస్తున్న యువకుడిని కాట్రేనికోన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముమ్మిడివరం సీఐ మోహన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... సోమవారం కుండలేశ్వరం ఏటిగట్టు వద్ద కాట్రేనికోన ఇన్‌ఛార్జి ఎస్సై శివకృష్ణ, మరో ఎస్సై సత్యనారాయణ, సిబ్బంది కలిసి వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో అమలాపురం కామనగరువు కరక్కాయపేటకు చెందిన ఎన్.సుధీర్ (జీప్పీ) పల్సర్‌పై మురమళ్ల వైపు వెళ్తున్నాడు. అనుమానం వచ్చిన పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకుని తనిఖీలు చేశారు. అతడి వద్ద కిలోన్నర గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు నడుపుతున్న పల్సర్‌ను ముమ్మిడివరం అనాతవరంలో చోరీ చేసినట్టు పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. సుధీర్‌పై ఇప్పటికే ఆరు కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు చిత్తు

యానాం: మాదక ద్రవ్యాల వినియోగంతో జీవితాలు చిత్తవుతాయని, చెడు స్నేహాలతో భవిష్యత్తు నాశనం అవుతుందని యానాం ఎస్సైలు ఎం.కుమార్, డి.పట్టాభిరామయ్య అన్నారు. సోమవారం స్థానిక శారదా విద్యానికేతన్‌లో విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. హెచ్ఎం సుబ్బారావు, ప్రతినిధులు వెంకటేశ్వరరావు, మహాలక్ష్మి, పుణ్యలక్ష్మి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: రామచంద్రపురం మండలం జగన్నాయకులపాలెంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వెంటూరు శివారు చొల్లంగిపేటకు చెందిన చొల్లంగి అనంతలక్ష్మి (55) మృతి చెందారు. ప్రమాదంపై కేసు నమోదుచేసిన పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చొల్లంగి సత్యనారాయణ, అనంతలక్ష్మి దంపతులు మోటారు సైకిల్‌పై వేగాయమ్మపేటలోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా జగన్నాయకులపాలెంలో వెనుక నుంచి వస్తున్న వ్యాన్ వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో భార్యాభర్తలిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే అనంతలక్ష్మి మృతిచెందినట్లు ప్రకటించారు. భర్త సత్యనారాయణ చికిత్స పొందుతున్నారు. కేసును ఎస్సై ఎం.లక్ష్మణ్ దర్యాప్తు చేస్తున్నారు.

సూర్యచంద్రరావుకు నివాళి

సూర్యచంద్రరావు విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: కాపు రిజర్వేషన్ పోరాటసమితి నాయకుడు నల్లా సూర్యచంద్రరావు వర్ధంతిని అమలాపురంలోని ఆయన అభిమానులు నిర్వహించారు. స్థానిక గడియారస్తంభం ప్రాంగణంలో నల్లా అజేయ్, సంజేయ్, సూర్యచంద్రరావు ట్రస్టుల ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు, అన్నదానం చేశారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్, తెదేపా నాయకులు మెట్ల రమణబాబు, చెరుకూరి సాయిరామ్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ నల్లా విష్ణుమూర్తి, జనసేన నాయకులు నల్లా శ్రీధర్, కల్వకొలను తాతాజీ తదితరులు సూర్యచంద్రరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మహిపాలవీధి, గండువీధి, నల్లా గార్డెన్స్‌లలో ప్రధాన రహదారులలో కాపు సంఘం నాయకులు, తెదేపా, భాజపా, జనసేన పార్టీ, వైకాపా పార్టీల నాయకులు సూర్యచంద్రరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

మాతృభాష పరిరక్షణకు కృషి చేయాలి

రావులపాలెం పట్టణం: మాతృభాష పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, తెదేపా సాంస్కృతిక శాఖ జిల్లా అధ్యక్షుడు ఆనందరెడ్డి అన్నారు. రావులపాలెంలోని సీఆర్సీలో ప్రగతి భారతం ట్రస్టు, మాతృభాష పరిరక్షణ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో శతక పద్య సహస్ర గలార్చన వేమన శతకం కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ట్రస్టు ఛైర్మన్ తమనంపూడి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో 22 పాఠశాలలకు చెందిన 1,008 మంది చిన్నారులు పాల్గొని వేమన శతకంలోని 108 పద్యాలను ఆలపించారు.

పునాదుల్లోనే భవనం

ఉప్పలగుప్తం మండలం గోపవరంలో గత ప్రభుత్వం తలపెట్టిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం పునాదుల్లోనే నిలిచిపోయింది. అప్పట్లో నిధుల సక్రమంగా మంజూరుకాక నిర్మాణం ఆగిపోయింది. మందులు, ఇతర పరికరాలు భద్రపరచడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అధికారులు స్పందించి భవన నిర్మాణానికి నిధులు మంజూరుచేసి పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

ఆర్థికసాయం అందజేత

కాట్రేనికోన, న్యూస్‌టుడే : ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందిన గచ్చకాయలపొరకు చెందిన ఎం.నరసింహవర్మ కుటుంబానికి శ్రీనవ చైతన్య, ఎలక్ట్రికల్, ప్లంబింగ్, రివైండింగ్ వర్కర్స్ అసోసియేషన్ సభ్యులు అండగా నిలిచారు. సోమవారం యూనియన్ తరపున రూ.20వేలు అందించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు శ్రీనివాస్ వర్మ, సత్తిబాబు, రాంబాబు, సతీష్, పండు, నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణ తొలగించాలని ఫిర్యాదు

కాట్రేనికోన, న్యూస్‌టుడే : కాట్రేనికోన సంతమార్కెట్ ఆవరణలో ఓ వ్యక్తి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నాడని, అధికారులు పరిశీలించి ఆక్రమణలు తొలగించాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గ్రామంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు.

స్వచ్ఛంద ఉద్యోగ విరమణ

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: గతంలో జిల్లా విద్యాశాఖాధికారిగా పని చేసి ప్రస్తుతం విద్యాశాఖలో ఏడీగా పనిచేస్తున్న పి.నాగేశ్వరరావు స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. ఆయనను ఏపీటీఎఫ్(1938) జిల్లా నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్ఎన్.మునేశ్వరరావు, ఎన్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నాగేశ్వరరావును అభినందిస్తున్న ఏపీటీఎఫ్ సభ్యులు

ప్రకటన

మహారాజశ్రీ మోటారు ఆక్సిడెంట్స్ క్లైమ్స్ ట్రిబ్యునల్ యానాం
మహారాజశ్రీ సబ్ ఆర్డినేట్ జడ్జి వారి కోర్టు, యానాం
ఎం.ఎ.సి.టి.ఓపి.04/2025

బిట్వీన్:
చింతపల్లి మంగాయమ్మ ...పిటీషనరు
మరియు
ముంగమూరి మహేశ్, వగైరాలు ...రెస్పాండెంట్లు

పై నెంబరు ఎం.ఎ.సి.టి.ఓ.పి 04/2025లో రెండవ ప్రతివాది అయిన, మోణో టూర్స్ & ట్రావెల్స్ బస్సు నెంబరు PY 04A 6618, ప్రొప్రయిటరు: సురేష్ ఉదయగిరి, డోరు నెంబరు 4-4-024, కాకివారి వీధి, యానాం- 533464, పుదుచ్చేరి అనువారికి ఎన్నిసార్లు పై కోర్టు వారు నోటీసులు జారీ చేసినప్పటికీ సదరు నోటీసులు ఉద్దేశపూర్వకముగా తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున పిటీషనర్ వారి కోరిక మేరకు పైకోర్టు వారు సదరు రెండవ ప్రతివాదికి ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసు జారీచేయ ఆజ్ఞాపించినారు. కావున సదరు రెండవ ప్రతివాది స్వయముగా /వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట 08-09-2026 (మంగళవారము) తేదీన ఉదయము 10-00 గంటలకు హాజరు అయ్యి ఏమైనా ఆక్షేపణలు ఉన్నఎడల తెలియపరుచుకోవచ్చును. అట్లుచేయని యెడల పరోక్షముగా తీర్మానించబడును అని తెలియచేయడమైనది.

శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
యానాం,
27-08-2026.
కముజు సూర్యనారాయణ
న్యాయవాది, యానాం